Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 17.07.2015, శుక్రవారం
సంపుటి : 35 సంచిక : 07
పేజీలు : 12, వెల : ₹ 5


ISO 9001-2008
Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



## నిర్లక్ష్యానికి పరాకాష్ట

# బాబు కి బలి





## అతిగా ప్రచారం చేసి అమాయక భక్తులను సమిధలుగా మార్చారు

గోదావరి మహాపుష్కరాలు విషాదంతో మొదలయ్యాయి. పుష్కరాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏదో తీరులో చేయాలనుకుంటే అవి ఇంకో తీరులోకి మారాయి. 14వ తేదీ పుష్కరాల ప్రారంభంరోజునే రాజమండ్రిలోని కోట గుమ్మం ఘాట్ వద్ద జరిగిన తొక్కిసలాటలో పుణ్యస్నానాలకని వచ్చి 27మంది పుణ్యలోకాలకు వెళ్లిపోయారు. ఇవి సర్కారీ హత్యలేనని, ముఖ్యంగా చంద్రబాబు చేసిన హత్యలేనంటూ ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. పుష్కరాల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నానంటూ చెప్పుకున్న చంద్రబాబు చివరికి వెలగబెట్టిన నిర్వాకం ఇదా.. అని ప్రజలు కూడా తీవ్రంగా దుయ్యబడుతున్నారు. (మిగతా 11వ పేజీలో)

## 1600 కోట్లు ఖర్చు పెట్టింది ప్రాణాలు తీయడానికా?

• మీడియా...

# మంచి చేస్తుందా? ముంచేస్తుందా?

సాక్షి ఈనాడు TV9 Telugu ABN ఆంధ్రజ్యోతి NTV 10tv TV5 NEWS STUDIO N MAHAA NEWS i NEWS CVR NEWS

ప్రజాస్వామ్యానికి ఫోర్త్ ఎస్టేట్‌గా పిలువబడే మీడియా ఈరోజు సక్రమ మార్గంలోనే ఉందా? తన భాద్యతలను సక్రమంగా నిర్వర్తిస్తుందా? నూటికి నూరుశాతం 'అవును' అని చెప్పలేరు.

ఈరోజు మీడియా సంస్థలన్నీ రాజకీయపార్టీలు, పారిశ్రామికవేత్తలు, బడా వ్యాపారుల చేతుల్లోనే ఉన్నాయి. కాబట్టి ఏ మీడియా సంస్థ నుండి కూడా నూరుశాతం నిజాయితీని ఆశించలేం. ఆర్థిక అవసరాలు తీరకుండా ఈరోజు మీడియా సంస్థలను నడిపే పరిస్థితి కూడా లేదు.

అయితే ఏ రాజకీయపార్టీకి కొమ్ముకాసే మీడియా సంస్థ అయినా సమాజం పట్ల తన బాధ్యతను కొంతవరకన్నా నెరవేర్చాలి. పాలకులు, ప్రభుత్వాలు దారి తప్పిపోతున్నప్పుడు ఇది తప్పు అని తెలియజెప్పాలి. మన వాళ్లే కదా అని తప్పు చేసినా చప్పట్లు కొడుతుంటే 'తోటకూర దొంగ' కథలాగే అవుతుంది. మీడియా సంస్థలు తమకు నచ్చిన రాజకీయ పార్టీలకు మేలు చేసే క్రమంలో రాష్ట్రానికి చేటు చేస్తున్నాయి. (మిగతా 11వ పేజీలో)

## ఉత్తరక్రియలు



మంచి మనసున్న అమృతమూర్తి
ప్రేమకు ప్రతిరూపమైన
మా మాతృమూర్తి, మా ఇంటి దైవం
**శ్రీమతి బీద బుజ్జమ్మ గారు**
తే. 07.07.15ది మంగళవారం
స్వర్గస్తురాలైనారు.
వారి పవిత్రాత్మకు శాంతిని చేకూర్చాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు - కోడలు
**బీద మస్తాన్‌రావు - మంజులమ్మ**
మాజీ శాసనసభ్యులు,
రాజధాని కమిటి సభ్యులు

మనుమడు
**మనోజ్**

మనుమరాలు
**కె.మాధురి - మహితేజ**

అల్లుళ్లు - కుమార్తెలు
**దేవరాల సుబ్రహ్మణ్యం - మస్తానమ్మ**
ఎంపిపి చైర్మెన్, కావలి 10వ డివిజన్ కార్పొరేటర్, నెల్లూరు.
**డాక్టర్ తాడిబోయిన వెంకటేశ్వరరావు - డాక్టర్ మస్తానమ్మ**
మాజీమున్సిపల్ చైర్‌పర్సన్, తెనాలి
**వేలూరు అయ్యపరాజు - విజయలక్ష్మి**
**దేవరాల శ్రీనివాసులు - రాజేశ్వరి**

**ఉత్తరక్రియలు** తే. 23.07.15ది గురువారం అల్లూరు మండలం ఇస్కపాలెం గ్రామంలోని మా స్వగృహమునందు జరుగును. కావున తెలియజేయడమైనది.

## ఉత్తమ పిహెచ్‌సిగా తుమ్మలపెంట

నెల్లూరుజిల్లాలో ద్వితీయ ఉత్తమ పిహెచ్‌సిగా కావలి మండలం తుమ్మల పెంటను, ఉత్తమ పిహెచ్‌సి వైద్యుడిగా తుమ్మలపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా॥ వెంకటేశ్వర్లును జిల్లా అధికారులు ఎంపిక చేశారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నెల్లూరు టౌన్‌హాల్లో 11వ తేదీ జరిగిన కార్య క్రమంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఈ అవార్డు లను తుమ్మలపెంట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వై.వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఉత్తమ ఆశా వర్కర్‌గా తుమ్మలపెంట పిహెచ్‌సి పరిధిలో విధులు నిర్వహిస్తున్న భూదేవమ్మను ఎంపిక చేశారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లలో ఉత్తమ సర్జన్‌గా కావలి పిపి యూనిట్ వైద్యాధికారి డాక్టర్ కోటేశ్వరరావును ఎంపిక చేశారు. ఈయనకు అవార్డును ఎంపి మేకపాటి అందజేశారు.

## టీ పక్షులు

చిన్ని నారాయణరావు
9440202942

సాయంత్రమైందంటే చాలు
మనుషులు గువ్వలై నక్షత్రాల్ని
తలపోస్తూ గుంపులు గుంపులుగా
ప్రత్యక్షమవుతారు.
కొందరు కబుర్ల కార్ఖానాలవుతారు
నురగలుకక్కే తేనీరు
దృశ్యాదృశ్యంగా కనుల వెలిగిస్తుంది
మనసు పులకింతలతో
కోర్కెలు విహంగాలవుతాయి
టీ అంటే అది టీ కాదు
మనసును తేలిక పరచే పానీయం
హృది ఆనందగీతికల అంచున
తేలియాడుతున్నపుడు
ఆత్మీయమై అలరించే నేస్తం
గుక్కెడు టీయే కదా!
మనిషి ఆటుపోట్ల సంద్రంలో
కొట్టుమిట్టాడుతున్నపుడు
తెరచాపగా నిలచేది
మరోకప్పు తేనీరు మాత్రమే కదా
కాసిన్ని ఆలోచనల్ని ప్రోది
చేసుకొనే దిశగా
మనిషిని నడిపించే సర్వోన్నత
శక్తి సంపన్నత... ఛాయ్‌దే గదా
సమయాన్ని వైభవోపేతం చేసి
ఆకుపచ్చ తివాచీ పరిచేది
కాలానికి పూల వంతెన కట్టేది
ఆనంద టీ సేవనంతోనే కదా
కేవలం అదొక్క'టీ' మాత్రమే
అపురూప అమృతపానీయం
గుండెల్లో వేకువను సృష్టించి
ముమ్ముందుకు నడిపించే ఉత్తేజం!
మనిషి కదే కదా ఇంధనం!!

# మంచి అయ్యోర్లు లేకుండా చదువు చెప్తే ఎలా?

### - ప్రైవేట్ స్కూళ్ళ తీరుపై డిఇఓ మండిపాటు

ప్రాథమిక దశే విద్యార్థులకు విద్యలో మంచి పునాది పడాల్సిన దశ. అలాంటి విద్యార్థులకు విద్యార్హతలు తక్కువగా వున్నవారితో పాఠాలు చెప్పిస్తే వారి భవిత ఏంకావాలి?.. అర్హత కలిగిన ఉపాధ్యా యులచే విద్యను అందించకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే ఊరుకునేది లేదు..కఠిన చర్యలు తప్పవంటూ డిఇఓ దొంతు ఆంజనేయులు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రతినిధులను హెచ్చ రించారు. ఈ నెల 11న నెల్లూరులోని పాత జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఇఓ మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలు ఆదర్శ వంతమైన రీతిలో వుండాలన్నారు. పలు పాఠశాలల్లో తక్కువ విద్యార్హతలున్నవారిచే పిల్లలకు పాఠాలు చెప్పిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిని సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రాథమిక దశలోనే విద్యార్థులను ఉత్తమ శ్రేణి విద్యార్థులుగా రూపొం దించడమే ప్రధాన లక్ష్యంగా వుండాలని అన్నారు. విద్యార్థులకు మంచివిద్యను బోధించేవిధంగా విద్యార్హతలు బాగా వున్నవారినే ఉపాధ్యాయులుగా నియ మించుకోవాలన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో ప్రైవేట్ స్కూళ్ళు నడపకూడదని, తప్పనిసరిగా ఆయా రోజుల్లో సెలవు ఇవ్వాల్సిందేనని ఆయన ప్రైవేట్ పాఠశా లల వారిని ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఇఓ షా మహ్మద్, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పది మద్యం షాపులకు ఒకటే దరఖాస్తు

పది మద్యం దుకాణాలకు సంబంధించి గత వారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ జారీచేస్తే ఒక్కటంటే ఒక్క దరఖాస్తు మాత్రమే వచ్చింది. నెల్లూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో రెండు, గూడూరు సర్కిల్ పరిధిలో 8దుకాణాలకు నోటిఫికేషన్ జారీచేసారు మంగళవారం సాయంత్రం నెల్లూరుజిల్లా సీతారాంపురం లోని మద్యం దుకాణానికి మాత్రమే ఒకవ్యక్తి దరఖాస్తు చేయడంతో లాటరీ అవసరం లేకుండా అతనికే దానిని కేటాయించారు ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ శ్రీనివాసరావు నేతృత్వంలో డిఆర్ఓ సుదర్శన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఆ దరఖాస్తును పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు నెల్లూరు పరిధిలో వరికుంటపాడులో ఒకటి, గూడూరు సర్కిల్‌పరిధిలో 8దుకాణాలకు దరఖాస్తులు రాక మిగిలిపోయాయి.

## గిరిజనులకు సోలార్ పంప్‌సెట్లు

నెల్లూరుజిల్లాలో అయిదు వందలమంది గిరిజన కుటుంబాలకు రూ.25 కోట్లు విలువజేసే సోలార్ పంప్‌సెట్లను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.జానకి అన్నారు. మంగళవారం చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం వద్ద ఏర్పాటైన మీనాక్షీ థర్మల్ విద్యుత్‌కేంద్రం ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడుతూ, రూ.5 లక్షలు విలువైన సోలార్ పంప్‌సెట్ల వ్యయంలో నాలుగున్నర లక్షలు ప్రభుత్వం భరిస్తుందని, మిగిలిన రూ.50 వేలు పరిశ్రమల వారు అందజేస్తారని తెలిపారు. గ్రామాల్లో శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రవీందర్, పరిశ్రమ ప్రతినిధులు, సర్పంచ్ పోలంగారి వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ ప్రసాద్, విఆర్ఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌లో 19కేసులు



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న ఏడో అదనపు జిల్లా జడ్జి గురప్ప

గూడూరులోని కోర్టు ఆవరణంలో 11వతేదీ జరిగిన లోక్‌అదాలత్‌లో 19కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా అదాలత్ ప్రారంభ సమావేశంలో ఏడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మెన్ పి.గురప్ప మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో వీలున్న కేసులను రాజీ చేసి పరిష్కరిస్తున్నామన్నారు. ఇందులో పురపాలక సంఘానికి సంబంధించిన నీటిపన్నుల కేసులు 10, సివిల్ 2, క్రిమినల్ 7కేసులను పరిష్కరించగా, పరిహారంగా 2,83,280 చెల్లించాలన్నారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ సివిల్ జడ్జి డి.ఏడుకొండలు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్, అడిషనల్ సివిల్ జడ్జి కె.పి.సాయిరామ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న వాగ్గేయకార సంగీతోత్సవాలు



ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ఆధ్వ ర్యంలో నెల్లూరు టౌన్‌హాల్లో ఈ నెల 9,10 తేదీలలో రెండు రోజులు పాటు నిర్వహించిన వాగ్గేయకార సంగీతోత్సవాలు సంగీతాభిమాను లను ఆకట్టుకున్నాయి. సంగీత పాఠశాల విద్యార్థులు, సింహపురి కల్చరల్ అకాడమీ విద్యార్థుల నృత్యప్రదర్శనలు అలరించాయి. చిన్నారులు రేణిగుంట సుమేధ, శర్వాణి, హర్షిత, హృతికాకృష్ణ, హర్షితాకృష్ణ, లాస్య, మోక్షిత, కుముద ప్రియ, ఇందిర, సాయి దీప్తి, ద్రితిసాయి, వైష్ణవి ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను రంజింపజేసాయి. సి.మునికుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, డా.సర్వేపల్లి అజయ్‌కుమార్, బి.వి.నరసింహం, రేణిగుంట రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

## సమ న్యాయం.. సత్వర పరిష్కారం


సమన్యాయం, సత్వర పరిష్కారం ధ్యేయంగా ముందుకు సాగుతున్న లోక్‌అదాలత్ కక్షిదారులకు ఎంతో ఉపయోగపడుతోంది. కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చి అనేక కేసులను సమన్యాయంతో పరిష్కరించేందుకు లోక్‌అదాలత్ బృహత్తర కృషి చేస్తోంది. దీంతో వేల సంఖ్యలోనే పెండింగ్ కేసులు పరిష్కారమవుతుండడం విశేషం.

ఈ నెల 11న జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులో జాతీయ లోక్‌అదాలత్ జరిగింది. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవాసదన్ భవన్‌లో జరిగిన లోక్‌అదాలత్ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ కనకదుర్గారావు మాట్లాడుతూ, వివాదాల పరిష్కారానికి రాజీయే రాజమార్గమని అంటూ, ఈ మెగా లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో వున్న కేసుల పరిష్కారం కోసం ప్రతి నెలా రెండవ శనివారంనాడు జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని, కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చి కేసులను పరిష్కరించడం ద్వారా సమన్యాయం సత్వరమే లభిస్తుందని ఆయన అన్నారు. పలు పెండింగ్ కేసులతో పాటు ప్రీలిటిగేషన్ కేసులు, స్థానిక సంస్థల కేసులను కూడా పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జితో పాటు, 2,3,4,5వ అదనపు జిల్లాజడ్జిలు ఎస్‌వి నరసింహ రాజు, బి. పాపిరెడ్డి, సిహెచ్ రామచంద్రమూర్తి, ఎం.కృష్ణప్ప, జిల్లా లీగల్‌సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సి.సత్యవాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రామచంద్రారెడ్డి తదితర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. కాగా, 11వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 1927 కేసులు పరిష్కారం కావడం విశేషం.

## 'మెరిట్స్' ప్రిన్సిపాల్‌కు పిహెచ్‌డి

ఉదయగిరిలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అన్నపరెడ్డి రామస్వామిరెడ్డికి కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పిహెచ్‌డి ప్రదానం చేసింది. ఆయన స్వస్థలం గుంటూరు. ఇటీవల 'ఎఫిషియంట్ ఎంఆర్‌ఎఫ్ మోడల్స్ ఫర్ డయాగ్నసిస్ ఆఫ్ బ్రెయిన్ అబ్‌నార్మలిటీ బేస్డ్ ఆన్ మ్యాగ్నటిక్ రీసోనెన్స్ ఇమేజెస్' అనే అంశంపై ఆయన సమర్పించిన సిద్ధాంతగ్రంథానికి ఈ పిహెచ్‌డి లభించింది. విద్యాబోధనలో విశేష అనుభవం గడించిన రామస్వామిరెడ్డికి పిహెచ్‌డి లభించిన సందర్భంగా, కళాశాల ఛైర్మెన్ మేకపాటి రాజ మోహన్‌రెడ్డి, కార్యదర్శి మేకపాటి చంద్రశేఖరరెడ్డి, పల్లపోలు వెంకటేశ్వర్‌రెడ్డి, పాశం సీతారామిరెడ్డితో పాటు ఆయన సహాధ్యాపకులు, సన్నిహితులు ఆయనను అభినందించారు.

## పినాకిని ఉచిత నోటు పుస్తకాలు



రత్నమ్మ ఛారిటబుల్ సొసైటి, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు ఫత్తేఖాన్‌పేటలోని నగరపాలక ప్రాథమిక పాఠశాల (రామయ్య బడి) విద్యార్థులకు పినాకిని యూత్ వెల్ఫేర్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు వందమంది విద్యార్థులకు నోటుపుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి స్కూలు ప్రధానోపాధ్యాయులు ఎల్.సనత్‌కుమార్ సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏపి కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.భవానినాగేంద్రప్రసాద్, అడ్వకేట్ నన్నేసాహెబ్‌లు మాట్లాడుతూ పేదవారికి సహాయం చేయడంలోనే నిజమైన ఆనందం ఉంటుందన్నారు. ఎస్‌విఆర్ స్కూలు కరస్పాండెంట్ అంబే శ్రీనివాసులు, సంస్థ ఉపాధ్యక్షులు రవి గోగులపల్లి, యస్.ప్రభాకరరాజు, సభ్యులు రాచపాళెం రఘువంశీ తదితరులు పాల్గొన్నారు.

## ● సాటిలేని మహానేత.. డాక్టర్ రాజశేఖరరెడ్డి

# డల్లాస్‌లో వైఎస్ జయంతి వేడుకలు

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సాటిలేని మహానేత అనీ, తన మహోన్నతమైన సేవలతో ప్రజల హృదయాల్లో ఆయన చిరస్థాయిగా నిలచిపోయారని, ఆయన సేవలు మరచిపోలేనివనీ పలువురు వక్తలు గుర్తు చేసుకున్నారు.

ఈ నెల 11న డా.వైఎస్ జయంతి సందర్భంగా అమెరికాలోని డల్లాస్‌లో వున్న రుచిప్యాలెస్‌లో దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు అభిమాన జనసందోహం మధ్య ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, డాక్టర్ వైఎస్ సేవలను ప్రస్తుతిస్తూ ప్రసంగించారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం, ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు చేపట్టి అమలుచేసిన ఆ మహానేత రాజకీయ రంగంలో విశిష్టమైన నేతగా రాష్ట్రానికే కాక, దేశానికే ఖ్యాతి తెచ్చారని కొనియాడారు. వైఎస్సార్సీపి డల్లాస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తొలుత రమణారెడ్డి క్రిస్టపాటి స్వాగతం చెప్తూ, డా.వైఎస్ ప్రజాసేవకే అంకితమైన మహానేత అని, వైఎస్ పాలన ప్రజలకు స్వర్ణ యుగాన్ని తలపించిందని అన్నారు. వైఎస్ ప్రజలకు చేసిన సేవలు ఎన్నటికీ చిరస్మరణీయాలేనని అన్నారు. ఈ సందర్భంగా విఖ్యాత రంగస్థల నటుడు, గుమ్మడి గోపాలకృష్ణ ఆహుతులను ఆకట్టుకునే విధంగా పలు పద్యాలను గానం చేశారు. అనంతరం అక్కడి ప్రముఖులు, వైఎస్ అభిమానులు అందరూ కలసి క్యాండిల్స్ వెలిగించి వైఎస్‌ను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాఘవరెడ్డి, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి కొర్సపాటి, డాక్టర్ రమణారెడ్డి గూడూరు, డాక్టర్ తారా కుమార్‌రెడ్డి, డాక్టర్ దర్గా నాగిరెడ్డి, డాక్టర్ రామిరెడ్డి బుచ్చిపూడి, విశ్వనాధ్ కిచ్లీ, ప్రతాప్ భీమిరెడ్డి, డాక్టర్ పవన్ పాముదుర్తి, కష్ణారెడ్డి కోడూరు, శ్రీనివాస ఓబులురెడ్డి, అజయ్‌రెడ్డి, మహేందర్ కామిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ఎన్ఎంఎస్ రెడ్డి, విజయ్ పిట్టా, రఘు చిట్టిమాల, జానకి మాందాడి తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత, ఎన్ఆర్ఐ వైఎస్సార్సీపి యుఎస్‌ఏ శాఖ ఛైర్మెన్ డాక్టర్ దర్గా నాగిరెడ్డి వై.యస్. ప్రస్థానాన్ని ప్రస్తావించి ప్రశంసించారు. అనంతరం, తమ శాఖకు నూతనంగా ఎన్నికైన కమిటీని ఈ కార్యక్రమంలో అందరికీ పరిచయం చేశారు. ఈ కమిటీలో రాజశేఖరరెడ్డి కేశిరెడ్డి (కన్వీనర్–కాలిఫోర్నియా), డాక్టర్ వాసుదేవ రెడ్డి (సౌత్‌రీజియన్ ఇన్‌ఛార్జి– ఫ్లోరిడా), డాక్టర్ రాఘవరెడ్డి(అడ్వయిజరీ కమిటీ), డాక్టర్ రామిరెడ్డి బూచిపూడి (సోషల్ రెస్పాన్సిబిలిటీ ఛైర్), విశ్వనాధ కిచ్లీ (వెబ్ ఛైర్)లతో పాటు, డల్లాస్ కోర్ కమిటీ బృందం రమణ క్రిష్టపాటి, మహేష్ అదిభట్ల, డాక్టర్ పవన్ పాముదుర్తి, జయ చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి కోడూరు, మధు మల్లు, రమణ పుట్లూరు, తిరుమల కంభం, ఉమా మహేష్, రవి ఆరిమంద, కృష్ణ మోహన్‌రెడ్డి, శ్రీనివాస ఓబుల్‌రెడ్డి, జయ సింహారెడ్డి, ఉమామహేష్ కుర్రి, చంద్రశేఖర్ చింతాల, మల్లికార్జున్ మురారి, నశీంషేక్ తదితరులు వున్నారు.




# నెల్లూరులో ఎమ్మెల్సీ శీనయ్య



ప్రకాశం జిల్లా స్థానిక శాసనమండలి నుండి ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మాగుంట శ్రీనివాసులురెడ్డి 14వ తేదీ తొలిసారి నెల్లూరొచ్చారు. తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు, మాగుంట అభిమానులు ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

ఇక మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి అధ్వర్యంలో కేక్ కట్ చేసి శీనయ్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాగుంట శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పాటుపడే మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నిషాద్, అశోక్, రహీం, రాజేష్, సెల్వ, రాజా, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పరువు – ప్రతిష్ట

# వైకాపాకి ఆఫీసు లేదు

***కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, తెలుగుదేశం వంటి పెద్దపార్టీలకే కాదు లోక్‌సత్తా వంటి చిన్న పార్టీలకు కూడా నెల్లూరుజిల్లా పార్టీ కార్యాలయాలున్నాయి. పార్టీ ఆఫీసు ఐదంతస్తుల మేడలో వుందా? లేక పెంకుటింట్లో ఉందా అన్నది ఎవరూ చూడరు. జిల్లా పార్టీ ఆఫీసు ఉందా? లేదా? అన్నదే ముఖ్యం.***

ఈరోజు రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ చిన్నది కాదు. ప్రధాన ప్రతిపక్షం. సభ్యుల సంఖ్యలో దాదాపు అధికార పక్షానికి దరిదాపుల్లో వుంది. అలాంటి పార్టీకి జిల్లా పార్టీ కార్యాలయం లేకపోతే ఇబ్బందికరమే కదా!

నెల్లూరు మాగుంట లే అవుట్‌లో వున్న వైసిపి జిల్లా కార్యాలయాన్ని ఈమధ్యనే ఖాళీ చేయడం తెలిసిందే! ఈ పార్టీ కార్యాలయం విషయంలోనే జిల్లా పార్టీ అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రాజీనామా దాకా పోయారు. పార్టీ ఆఫీసును నడపాలంటే నెలకు లక్ష దాకా ఖర్చవుతుంది. జిల్లాలో వున్న నాయకులు దీని జోలికి రావడం లేదు. పార్టీ అధిష్టానం కూడా దీనిపై దృష్టి పెట్టలేదు. ఈ భారం భరించలేకే ప్రసన్న కూడా పార్టీ ఆఫీసును ఖాళీ చేసాడు.

నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు ఆఫీసులు పెట్టుకుని నడుపుతున్నారు. కాని ఒక పెద్ద పార్టీకి జిల్లా కార్యాలయం లేకపోవడం లోటే! ఎందుకంటే పార్టీ అన్నాకా నాయకులు నాలుగు రకాలుగా, నాలుగైదు వర్గాలుగా వుంటారు. ఒకరి ఆఫీసుకు ఇంకొకరు పోరు. ముఖ్యంగా నాయకుల మధ్య సమన్వయం కష్టమవుతుంది. అదే జిల్లా పార్టీ కార్యాలయం ఒకటుంటే నాయకులంతా సమావేశం కావడానికి, చర్చించుకోవడానికి ఆస్కారముంటుంది.

గతంలో ఇలా జిల్లా పార్టీ కార్యాలయాలను ఎత్తేసే ప్రజారాజ్యం పార్టీని స్థాపించిన చిరంజీవి ప్రజల్లో పలుచబడ్డారు. జిల్లా పార్టీ కార్యాలయాలను మూసేసాకే ఆయన ప్రజారాజ్యంను కాంగ్రెస్‌లో విలీనం చేసారు. రేకుల షెడ్డు, పూరిగుడిసెలోనైనా వైసిపి జిల్లా పార్టీ కార్యాలయాన్ని వెంటనే నడపాలని ఆ పార్టీ కార్యకర్తల కోరిక.



# పుష్కరాల్లో నెల్లూరు చిన్నారి యోగా విన్యాసాలు

గోదావరి మహాపుష్కరాలు ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 13వతేదీ సాయంత్రం రాజమండ్రిలోని పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేడుకలలో నెల్లూరు నారాయణ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఏకాంబరం జ్యోష్ణవి ప్రదర్శించిన యోగా విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతుల సమక్షంలో జ్యోష్ణవి చేసిన యోగా విన్యాసాలు వారిని కూడా అబ్బురపరిచాయి. జ్యోష్ణవి ఇటీవలే మలేసియాలో జరిగిన ఆసియా యోగా ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించి రాష్ట్ర కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు జ్యోష్ణవి పుష్కరాల్లో తన యోగా ప్రతిభను ప్రదర్శించి ముఖ్యమంత్రి మన్ననలు అందుకుంది.

# ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ




నెల్లూరు జిల్లా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం 12వ తేదీ ముగిసింది. అసోసియేషన్ అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో కావలి ఉప విద్యాశాఖాధికారి ఎం.శివకుమార్ పాల్గొని మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రాథమిక విద్యే ప్రధానమని, దాని సక్రమ నిర్వహణకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. నెల్లూరు ఉప విద్యాశాఖాధికారి షా అహ్మద్ మాట్లాడుతూ జీవితం అంటే చదువేనని, చదువులేని జీవితం నిరర్ధకమన్నారు.

ఈ సమావేశంలో ఇంకా ఎంఇఓ జగదీష్, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వి.సుబ్బారెడ్డి, ట్రైనర్ ఆర్తీ రాజారత్నం, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్, నగర అధ్యక్షులు సౌరెడ్డి, కార్యదర్శి ఎం.రవికుమార్, కోశాధికారి కృష్ణారావు, ఆయా స్కూళ్ల కరస్పాండెంట్లు బాలకృష్ణ, వాకాటి విజయకుమార్‌రెడ్డి, శంకర్, రత్నయ్య, నరసారెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.



# 'ప్రభా'తం

పుష్కర గోదావరి..విషాద గోదావరే అయ్యింది. తొలి రోజు పుష్కరస్నానాలు అనేక కుటుంబాల పాలిట మృత్యుజల క్రీడలే అయ్యాయి. పుష్కరస్నానాలతో పుణ్యం మూటగట్టుకోవాలని ఎంతెంతో దూరం నుంచి ఆశపడి వచ్చిన వారిని మృత్యువు కబళించింది.. దీంతో గోదావరితీరం శోకసంద్రమే అయ్యింది. పుష్కర సంరంభాలు మొదలైన కొద్దిసేపటికే జరిగిన తొక్కిసలాటలో 27 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో 32 మంది తీవ్రగాయాల పాలయ్యారు. మరణించినవారిలో అత్యధికులు మహిళలే. మొత్తం 23 మంది మహిళలు, వారితో పాటు మరో ముగ్గురు పురుషులు, ఒక బాలుడు ఈ దుర్ఘటనలో మృత్యు పద ఘట్టనల కింద పడి నలిగిపోయి.. చివరికి అనంతలోకాలకు తరలిపోయారు. ఇంతటి విషాదం గోదావరి తీరంలో బహుశా ఇదే ప్రథమం. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పుష్కరాలను ఆరంభించిన కాసేపటికే ఈ దుర్ఘటన జరగడంతో గోదావరి 'పుష్కరఘాట్' ప్రాంతమంతా హాహాకారాలతో, పెద్దపెట్టున ఏడ్పులు పెడబొబ్బలతో నిండిపోయింది. ఊహించని ఈ విషాద ఘటనతో దేశమంతా ఒక్కసారిగా నివ్వెర పోయింది. పవిత్ర గోదావరిలో పుష్కరస్నానం ఎంతో పుణ్యప్రదమని భావించి ఇక్కడకు వచ్చి, గోదావరి తీరంలో కాలుపెట్టిన కొంతసేపటికే పలువురు ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారక దృశ్యాలు.. మృతుల కుటుంబాలను మూర్ఛిల్లేలా చేశాయి. ఎంతో ఉత్సాహంతో గోదావరి పుష్కరాలకు వెళ్ళిన వారు శవాలుగా మారడాన్ని ఆ కుటుంబాల వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎవరెన్ని ఓదార్పు మాటలు చెప్పినా, లక్షల్లో ఎక్స్‌గ్రేషియా ఇస్తామన్నా పోయినవారి ప్రాణాలు మాత్రం తిరిగి వస్తాయా?.. కుటుంబసభ్యులను కోల్పోయిన ఆయా కుటుంబాలవారు పడుతున్న రోదన..హృదయవేదన తీర్చగలమా?..

మహారాష్ట్రలోని త్రయంబకేశ్వరంలో పుట్టిన గోదావరినది దాదాపు 1477 కిలోమీటర్ల దూరం ప్రయాణించి అంతర్వేది వద్ద సాగరంలో కలసిపోతుంది. ఇంతదూరం ప్రయాణించే ఈ నదిలో, పుష్కరాలను పురస్కరించుకుని ఈ 12 రోజుల్లో ఎక్కడ స్నానం చేసినా పుణ్యమే. అయితే, కొంతమంది కేవలం రాజమండ్రి వద్ద ఈ నదిలో స్నానం చేస్తే మహాపుణ్యమనే భావన కలిగేవిధంగా ప్రచారం చేయడంతో, గోదావరి పుష్కరాలు కాస్తా రాజమండ్రి పుష్కరాలుగా మారిపోయాయి. దీంతో, భక్తులంతా లక్షలాదిగా రాజమండ్రికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా ముఖ్యులు, మంత్రులు, ప్రముఖులు అంతా రాజమండ్రిలోనే పుష్కరస్నానాలు చేస్తున్నట్లు తెలియడంతో భక్తులంతా పెద్దసంఖ్యలో రాజమండ్రికి వచ్చేశారు. తీరా ఇక్కడికొస్తే అక్కడ ఎలాంటి సదుపాయాలూ లేవు. లక్షల సంఖ్యలో భక్తులు రాజమండ్రికి వస్తున్నారని తెలిసినప్పటికీ ప్రభుత్వం హడావిడీ చేయడం తప్ప భక్తుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లంటూ ఏమీ లేవు. చివరికి తాగేందుకు గుక్కెడు మంచినీరు కూడా దొరక్క భక్తులు విలవిలలాడిపోయారంటే, కోట్లాదిరూపాయలు వెచ్చించి భక్తులకు ఏమి ఏర్పాట్లు చేశారో ఏలినవారికే తెలియాలి. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రులకూ, వివిఐపీలకు భద్రత దృష్ట్యా ప్రత్యేక చర్యలు తీసుకోవడం తప్పనిసరి అవసరమే. అయితే, పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య వివిఐపీలకు ప్రత్యేక స్నానఘట్టాలు కేటాయించి వుండాలి. అదే సందర్భంలో, లక్షలాదిగా వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేసి వుండాలి. అలా జరగకపోవడమే పెద్ద లోపం. వివిఐపిల సేవలో తరిస్తూ, గంటల కొద్దీ భక్తులను క్యూలో నిలబెట్టిన అధికారులు, ఆ తర్వాత ఒక్కసారిగా మృత్యుద్వారాలను తెరచినట్లు గేట్లు తెరిచేసి, నిర్లక్ష్యంగా వెళ్ళిపోవడం పెద్ద లోపమే కాదు.. ఘోరమైన పాపం కూడా. వీరు చేసిన నిర్వాకానికి, అంతదాకా వేచి వున్న జనం.. ఒక్కసారిగా గేట్లు తెరవడంతోనే తోసుకుంటూ వెళ్లాల్సిరావడం, తొక్కిసలాట జరగడం.. కొంత మంది ఊపిరాడక కిందపడిపోవడం.. మరికొందరు మృత్యుపాదాల కింద నలిగిపోయి ప్రాణాలు కోల్పోవడం నిమిషాల్లోనే జరిగిపోయాయి. వినడానికే హృదయం ద్రవించే ఈ ఘటనకు భక్తలోకం చలించిపోయింది. పుణ్యం కోసం వచ్చిన భక్తులు ఇలా మృత్యువాత పడడానికి మానవ తప్పిదమే ముఖ్య కారణం కావడం ఎంత ఘోరం?.. పుష్కరయాత్రలు పుణ్యప్రదమంటూ పెద్దపెట్టున ప్రచారం చేసిన ప్రభుత్వం, సంబంధిత అధికారులు, వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన అధికారగణం.. భారీ పోలీసుయంత్రాగం అంతా వున్నప్ప టికీ.. వారందరి కళ్ళముందే ఇంతటి మహాఘోరం జరిగిపోయింది. సామాన్య భక్తుల పట్ల ఎనలేని నిర్లక్ష్యం.. వారి ప్రాణాల పట్ల కనీస జాగ్రత్త లేని బాధ్యతారాహిత్యం భక్తుల ఉసురుపోసుకుంది. అసలు, ఏపీ జిల్లాల నుంచి ఎంతెంతమంది భక్తులు రాజమండ్రికి వస్తున్నారు.. వారికి ఎలాంటి భద్రతా ఏర్పాట్లు చేయాలి.. ఎవరికీ ఇబ్బంది లేకుండా ఏపీ ఘాట్‌లలో పుష్కరస్నానాలు చేయించాలి?.. అనే ఆలోచనే లేనట్లుగా, ఎవరి చిత్తానుసారం వారు వ్యవ హరించడం ఘోరమైన నేరం. పుష్కరాల ఏర్పాట్లకు దాదాపు 1,650 కోట్ల రూపాయల దాకా వెచ్చించామంటున్నారే.. ఆ డబ్బంతా ఏమైంది?.. అంత దూరం వచ్చిన భక్తులకు కనీసం గుక్కెడు నీళ్ళిచ్చే దిక్కు కూడా లేకుండా పోయిందా?.. ఏమిటీ ఘోరం?.. గోదావరి పొడుగునా ఎన్నో స్నానఘట్టాలు వున్నా, జనమంతా రాజమండ్రికే వచ్చేలా చేసిందెవరు?.. పుష్కరఘాట్‌లో అంతమంది జనానికి చోటు లేదని తెలిసీ, రాజమండ్రిలో మరో 17 స్నానఘట్టాలున్నప్పటికీ, భక్తులను ఆ ఘట్టాలకు తరలివెళ్ళేలా చేయకుండా, ఒక్క పుష్కరఘాట్‌నే మృత్యుద్వారంలా తెరవడం ఘోరమైన పాపం కాదా?.. ఈ నిర్వాకానికి బాధ్యు లెవ్వరు?.. ఏర్పాట్లలో అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యం.. అధికారుల్లో అలసత్వం, పోలీసుల వైఫల్యం, అన్నిటికీ మించి బాధ్యతరాహిత్యమే ఈ దుర్ఘటనకు కారణం కావడం విచారకరం.. మరెంతో బాధాకరం!..

## విషాద పుష్కరం



పుణ్యం కోసం పుష్కరస్నానాలకు వెళ్తే ప్రాణాలే పోయాయి.. అన్నట్లుగా ఈసారి గోదావరి పుష్కరాలు పలు కుటుంబాలను శోకసముద్రంలో ముంచేశాయి. ప్రభుత్వ ప్రచారార్భాటాల సందట్లో గోదావరి పుష్కరాలు కాస్తా రాజమండ్రి పుష్కరాలుగా మారిపోవడంతో జనమంతా లక్షల సంఖ్యలో రాజమండ్రికి వెళ్లడం.. అక్కడ సరైన ఏర్పాట్లు లేకపోవడంతో తొక్కిసలాట జరిగి 27 మంది భక్తులు ప్రాణాలు కోల్పోవడం దారుణం!.. భక్తులకు తగు ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం.. పోలీసుల వైఫల్యం.. మొత్తంగా బాధ్యతారాహిత్యంతో ఇంతటి ఘోరం జరగడం ఎంతైనా బాధాకరం.

## విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు



రంజాన్ ఉపవాసం నెల సందర్భంగా నెల్లూరు జెండావీధి పివిఎస్ఎమ్ హైస్కూల్‌లో ఉండే ముస్లిం విద్యార్థులకు జిల్లా ముస్లిం యూత్ సేవా కమిటి ఆధ్వర్యంలో సోమవారం పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా కమిటి అధ్యక్షుడు ఎస్.కె.ఖలీద్, మున్నా, నయాంబేక్, జమీర్, ఇస్సాక్, ఎజాజ్, ఫారుక్, అల్తాఫ్, జహీర్, తాహేర్, శరత్‌పవార్ తదితరులు పాల్గొన్నారు.

## పేద గిరిజన విద్యార్థులకు ఆర్థిక సాయం

ఏకలవ్య గిరిజన అభివృద్ధి, విద్యా సాధికారిక సంఘం ఆధ్వర్యంలో 13జిల్లాల నవ్యాంధ్రప్రదేశ్‌లో 3వ ఏకలవ్య ప్రతిభా అవార్డులను 2014-15 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 8.5గ్రేడ్, ఆపైన ఉత్తీర్ణులైన ఎరుకుల పేద విద్యార్థిని విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం ఒక్కొక్కరికి రూ.10,000లు ఇవ్వడం జరుగుతుందని అధ్యక్ష ప్రధానకార్యదర్శులు శ్రీరామస్వామి, దేవరకొండ శ్రీనివాసులు తెలిపారు. పేద ఎరుకుల విద్యార్థినీ విద్యార్థులు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తుతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫోటో, యస్‌యస్‌సి మార్కుల కాపీని జత పరచి ఆగస్టు 5వ తేదీలోగా ఏకలవ్య గిరిజన అభివృద్ధి, విద్యాసాధికారిక సంఘం, బి-3, రేణుక ఎన్‌క్లేవ్, మధు కాంప్లెక్స్ దగ్గర, మొగల్రాజ్‌పురం, విజయవాడ - 520010 అడ్రసుకు పంపాలన్నారు. ఇతర వివరాలకు 94920 41177, 99498 25223 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

నెల్లూరు రంగనాయకులపేటకు చెందిన కారు డ్రైవర్ అన్వర్ కుటుంబాన్ని నెల్లూరు కార్ ట్రావెల్స్ ఓనర్స్ అసోసియేషన్ మానవతా దృక్పథంతో ఆదుకుంది. నాలుగు నెలల క్రితం బాడుగకు వెళ్ళి హత్యకు గురైన అన్వర్ కుటుంబసభ్యులకు కార్ల యజమానులు తమవంతుగా ఆదివారం రూ.30వేలు విలువచేసే రెండు బాండ్లు మరో రూ.10,900లు నగదును అందజేశారు. కుటుంబ యజమాని హఠాన్మరణంతో దిక్కుతోచని కుటుంబసభ్యులను ఆదుకోవాలన్న సంకల్పంతో తమవంతు తోడ్పాటు అందించినట్లు అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పి.సాబీర్‌ఖాన్, హయత్ బాషా, వై.వెంకన్న, కె.ఐ.ప్రదీప్, ఎన్.వి.శ్రీధర్, ఓబులునాయుడు, వెంకట్, మల్లి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఉచిత వస్త్రాలు

రంజాన్ పండుగ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు మెక్లిన్స్ రోడ్డు లోని మీరామొహిద్దీన్ దర్గా వద్ద రెండొందల పేద కుటుంబాల వారికి నిత్యావసర సరుకులు, వస్త్రాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ జలీల్, లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్షులు తోట నాగరాజు, కార్యదర్శి కె.ప్రవీణ్‌శంకర్, కోశాధికారి ఆర్.హజరత్‌బాబు, ఇంజనీర్లు ప్రసాద్‌రెడ్డి, షంషుద్దీన్, రమణారావు, కరీం అహమ్మద్, షబీర్, జాఫర్, ఉమాశంకర్, కామేశ్వర రావు, సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## కవితలకు ఆహ్వానం

కవిత్వాన్నే జీవితంగా భావించిన సాహితీ కృషీవలుడు డా॥ రాధేయ గౌరవార్థం ఆయన శిష్యులు పెళ్లూరు సునీల్, సుంకర గోపాల్, దోర్నాదుల సిద్దార్థ "డా॥ రాధేయ కవితా పురస్కారం" పేరిట రాష్ట్ర స్థాయి అవార్డును నెలకొల్పారు. ఆరవ వార్షికోత్సవం సందర్భంగా తెలుగులో కవిత్వం వ్రాసే ఏ ప్రాంతం కవులనుంచైనా వచన కవితలను ఆహ్వానిస్తున్నారు. న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన ఉత్తమ కవితకు రూ.2,116/- నగదు, జ్ఞాపికతో సత్కారం జరుగుతుందన్నారు. కవితలు సామాజిక స్పృహ కలిగి వుండా లన్నారు. కవితలు ఆగస్టు నెల 15తేదీలోగా సుంకర గోపాలయ్య, శ్యామ సుందరపురం, కోట గ్రామం & మండలం, నెల్లూరు జిల్లా చిరునామాకు పంపాలని కోరారు. ఇతర వివరాలకు 94402 255647, 9492638547 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## ఎన్డీఏ ఎజెండా

అవినీతికి అంద కాకూడదు. ఎన్డీయే ఎజెండా ఇది! ఇప్పు డిప్పుడే ఎన్డీయేకి అవినీతి మరకలు అంటుకునే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. బాబు 9ఏళ్ళ పరిపాలనలో ఆయన అవినీతిని గురించి పుస్తకాలే అచ్చేసిన బీజేపీ, ఎన్నికల్లో తెలుగుదేశంతో జతకట్టే విషయంలో వెంకయ్యనాయుడు ప్రముఖపాత్ర వహించాడు. ఓటుకు నోటు, ఫోన్ ట్యాపింగ్, స్మృతి ఇరానీ, సుష్మాస్వరాజ్, వసుంధరా రాజే, లలిత్‌మోడీ, వ్యవహారాల్లో నిర్మొహ మాటంగా నడుచుకోవాలి బీజేపీ. లేకుంటే మోడీ ఇమేజ్ డ్యామేజీ అయ్యే ప్రమాదముంది.

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## ఇన్ని కోట్లు ఎందుకు?

గోదావరి పుష్కరాలకు 1400 కోట్లు ఖర్చు చేయాలా? ఇదేదో డబ్బు తినడానికి చేసినట్లుంది గాని, పుష్కరాల మీద భక్తితో కాదు, ఇంత డబ్బును శాశ్వత అభివృద్ధి పనులకు ఖర్చు చేసుండొచ్చు. పుష్కరాల పనులన్నీ కూడా బూడిదలో పోసిన పన్నీరులాంటివే! అవి ఎక్కువకాలం నిలిచే పనులు కావు.

**పూడి దయాకర్, సూళ్లూరుపేట.**




## వసతులు లేవు

నెల్లూరు కార్పొరేషన్ అయ్యిందనే గాని ప్రత్యేక వసతులు లేవు. విజయవాడలో మాదిరిగా గ్యాస్ ఆటోలు నడిపితే కాలుష్యం తగ్గుతుంది. సెల్‌ఫోన్‌లు విపరీతంగా వాడుతున్నారు. భవిష్యత్‌లో చెవులు వినిపించకుండాపోయే ప్రమాదముంది. ఆగస్టు 1వ తేదీ నుండి హెల్మెట్లు వాడాలి. హెల్మెట్లు వాడేవాళ్లు తమ సెల్‌నెంబర్‌ను దానిపై ముద్రించాలి. ఎక్కడైనా మరచిపోయినా దొరికిన వాళ్లు తెచ్చివ్వగలరు.

వీరిశెట్టి రమ్యమాధురి, నెల్లూరు.

## మరీ దుర్మార్గం

ఇసుక అక్రమరవాణాను అడ్డుకున్న మహిళా తహశీల్దార్‌పై తెలుగుదేశం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దాడి చేసి ఇసుకలో ఈడ్చడం ఒక దుర్మార్గమైతే, ఇలాంటి దుర్మార్గులను చంద్రబాబు కాపాడుతుండడం ఇంకా దుర్మార్గం. నేరానికి పాల్పడ్డ ఎమ్మెల్యేపై చర్య తీసుకోకపోతే, రాష్ట్రంలోని అందరు ఎమ్మెల్యేలు కూడా అదే బాట పడతారు. అధికారులు అక్రమ ఇసుక రవాణాను పట్టించుకోరు.

**నాగిశెట్టి మహిజ, నెల్లూరు.**



పాండిచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామిని స్వాగతిస్తున్న అనపల్లి అశోక్‌రెడ్డి





కళ్యాణ మండపాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న రంగస్వామి

## "అశోక్‌రెడ్డి" కళ్యాణ మండపంలో పాండిచ్చేరి ముఖ్యమంత్రి

జూలై 12వ తేదీ ఆదివారం నాడు పాండిచ్చేరి నుండి బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా గోదావరి పుష్కరాల కోసం యానాంకి వెళ్ళిన పాండిచ్చేరి ముఖ్యమంత్రి యన్.రంగస్వామి నెల్లూరులో కొంతసేపు సేద తీరారు. పాండిచ్చేరితో మంచి సంబంధాలున్న అనపల్లి అశోక్‌రెడ్డి జాతీయ రహదారిపై కొత్తగా నిర్మించిన అనపల్లి కన్వెన్షన్ సెంటర్‌కి ఆదివారం రాత్రి చేరుకున్న రంగస్వామి, కళ్యాణ మండపాన్ని మొత్తం తిరిగి చూసి, మంచి సదుపాయాలతో అధునాతన హంగులతో కళ్యాణ వేదికను నిర్మించినందుకు అశోక్‌రెడ్డిని అభినందించారు. మెయిన్‌హాలుతో పాటు బయట లాన్‌లు, డైనింగ్‌హాల్స్, కిచెన్‌తో సహా మొత్తం ప్రాంగణాన్ని రంగస్వామి ఆసక్తిగా తిరిగి తిలకించడం విశేషం.

సహజంగానే మంచి స్నేహసంబంధాలు కలిగి వుండడమే కాకుండా ఆతిథ్యంలో సైతం తనదైన శైలిని చూపించే అశోక్‌రెడ్డి, రంగస్వామికి విందు ఇచ్చాడు. రంగస్వామికి ఇష్టమైన వంటకాలన్నీ నెల్లూరు స్టైల్‌లో తయారు చేయించి నెల్లూరీయుల రుచులు ఎలా వుంటాయో చూపించాడు.

## దివాళా దిశగా రియల్ వ్యాపారులు

*దాదాపు 30ఏళ్ల క్రితం వరకు కూడా రియల్ ఎస్టేట్‌కు పెద్ద ప్రాధాన్యత ఉండేది కాదు. చాలా తక్కువ మంది మాత్రమే దానిని నమ్ముకుని ఉండేవాళ్లు. 1999ప్రాంతం నుండి దేశంలో వచ్చిన మార్పులు, ఆర్థిక పరిణామాలు, మౌలిక వసతులు పెరగడం వంటివాటి మూలంగా రియల్‌ఎస్టేట్‌కు ప్రాధాన్యత పెరిగింది. గత ఎన్డీఏ ప్రభుత్వంలో జాతీయ రహదారిని నాలుగులైన్లుగా మార్చడం, ఆయా ప్రాంతాలలో పారిశ్రామిక సెజ్‌లు రావడం, దీంతో భూముల విలువలు అనూహ్యంగా పెరగడం, ఇతర రంగాలలో కంటే భూముల మీద పెట్టుబడులకే అధిక రాబడులు రావడం వంటి కారణాలతో ఈ రంగానికి దేశంలోనే అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల తర్వాత ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఎక్కువమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నది రియల్ ఎస్టేట్ రంగమే.*

### కోట్లు పెట్టుబడిగా పెట్టి... లబోదిబో మంటున్నారు..!

ఆంధ్రప్రదేశ్‌లో 2010 నుండి రియల్ వ్యాపారులు కష్టాల్లో ఉన్నారు. అంతకుముందు ఎన్డీఏ ప్రభుత్వంలో గాని, ఆ తర్వాత వై.యస్.రాజశేఖరరెడ్డి పాలనలోగాని ఆంధ్రాలో రియల్ వ్యాపారం కళ్లెంలేని గుర్రంలా పరుగులు తీసింది. 2009లో వై.యస్. మరణం రాష్ట్రంలో రియల్ వ్యాపారులకు శాపంగా మారింది. ఆయన పోవడంతోటే అభివృద్ధి కూడా ఆగిపోయింది. 'రియల్' పరుగు నిలిచిపోయింది. ఆ తర్వాత ముఖ్యమంత్రులుగా వచ్చిన రోశయ్య గాని, కిరణ్ గాని పరిపాలనలో, అభివృద్ధిలో వేగాన్ని చూపలేకపోవడంతో రియల్ ఎస్టేట్ రెక్కలు విరిగిపోయాయి. ఇక రాష్ట్ర విభజనతో రియల్ రంగం కుప్పకూలిపోయింది.

హైటెక్ మేధావి, ప్రపంచాన్ని చుట్టిన వీరుడు చంద్రబాబు ముఖ్యమంత్రయ్యాకన్నా రియల్ రంగానికి మంచిరోజులు వస్తాయని ఆశించారు. మంచి రోజులు బదులు ఇంకా గడ్డురోజులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు ఏ వ్యాపార రంగానికి కూడా ఊతమిచ్చే లాగా లేవు. ఇక చంద్రబాబు పాలనలో అరకొర ఊపిరితో వున్న రియల్ రంగానికి ఆ కొస ఊపిరి కూడా పోయినట్లయ్యింది. రాజధానికి ఎంపిక చేసిన ప్రాంతం వల్ల రియల్ ఎస్టేట్ వూపందుకోలేకపోయింది. రాజధాని కోసం గుంటూరు జిల్లాలో 30 వేల ఎకరాలు సేకరణకు ప్రభుత్వం సిద్ధం కావడం తెలిసిందే! ఇది భూసమీకరణ, అంటే రైతుకు రూపాయి నష్ట పరిహారం రాదు. ప్రభుత్వం అభివృద్ధి చేసి ఇచ్చిన భూమిని అక్కడ రైతులు అమ్ముకోవాలి. మరి ప్రభుత్వం అభివృద్ధి చేసేదెప్పుడు, వాళ్లు అమ్మేదెప్పుడు? అసలు కొనేదెవరు? ప్రభుత్వం అమరావతి రాజధాని ప్రకటించినా అక్కడ ఎకరా భూమిని కూడా ఎవరూ కొనడం లేదు. దీనికి కారణం ఆకాశాన్నంటుతున్న భూముల ధరలే! రాజధాని మూలంగా రియల్ రంగానికి ఎటువంటి ఉపయోగం లేకుండా పోయింది. అదే ఏ మెట్ట భూములున్న జిల్లాలో రాజధానిని ప్రకటించి వున్నా రియల్ వ్యాపారం పరిస్థితి ఆశాజనకంగా ఉండేది.

ఇక గడిచిన ఏడాదికాలంలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి ప్రాజెక్టులు లేవు. పరిశ్రమలూ లేవు. ప్రభుత్వం చెప్పిన ఏ ప్రాజెక్టులూ రాలేదు. దీంతో కుప్పకూలిన రియల్ రంగం తిరిగి కోలుకోవడం కష్టమవుతోంది.

నెల్లూరుజిల్లాలో అయితే కొన్ని వందల కోట్ల రూపాయల రియల్ ఎస్టేట్ లావాదేవీలు ఆగిపోయి వున్నాయి. పడిపోయిన మార్కెట్ వల్ల చాలామంది వ్యాపారులు దివాళా తీసారు. నిర్మాణ రంగం కూడా పూర్తి కష్టాల్లో వుంది. పెద్దసంఖ్యలో పూర్తయిన అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు ఖాళీగా ఉంటున్నాయి! అభివృద్ధి దిశగా ఒక్క అడుగూ ముందుకు పడకపోతుండడం రియల్ రంగానికి అవరోధంగా మారుతోంది.

### వాణిజ్యంలో రికార్డులు.. పనితీరుకు అవార్డులు


## కృష్ణపట్నం పోర్టుకు ప్రతిష్టాత్మక కానుక



ప్రపంచ మేజర్ పోర్టుల్లో ఒకటి... దేశంలోనే పెద్ద పోర్టు... ఒకటిన్నర లక్షల టన్నుల సామర్థ్యంగల నౌకలు లంగరు వేయగల పోర్టు... సరుకు లోడింగ్‌లోనూ, అన్‌లోడింగ్‌లోనూ చిరుతను తలపించే వేగం... ఇవీ నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం పోర్టు రికార్డులు. దీనికి తగ్గట్లుగా పోర్టు పనితీరుకు, ప్రగతికి ప్రతిఫలంగా ఎన్నో అవార్డులు వచ్చాయి. తాజాగా 25దేశాలలోని పేరుగాంచిన కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే ప్రతిష్టాత్మక 'గోల్డెన్ పీకాక్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్' అవార్డును కృష్ణపట్నం పోర్టు సొంతం చేసుకుంది. ఇటీవల న్యూ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కృష్ణపట్నం పోర్టు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ చింతా శశిధర్ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి ప్రకాశ్‌జవదేకర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు







- మూలిగే నక్కపై తాటికాయ

## రిజిస్ట్రేషన్ బాదుడుకు సిద్ధం

ఇప్పటికే స్థలాలు, పొలాల ధరలు ఆకాశాన్నంటి రిజిస్ట్రేషన్ స్టాంపు డ్యూటి విపరీతంగా పెరిగి పేద మధ్య తరగతి ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకోలేక అవస్థలు పడుతుంటే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఆగస్టు 1 నుంచి స్థలాలు, పొలాలు ధరలతో పాటు కట్టుబడి విలువలు కూడా పెంచేందుకు సన్నాహాలు చేస్తోంది. దీంతో మూలిగేనక్కపై తాటికాయ పడ్డట్లు పేద మధ్య తరగతి ప్రజలు దిక్కుతోచని అయోమయ స్థితిలో పడ్డారు. ప్రస్తుతం స్టాంపు డ్యూటి రిజిస్ట్రేషన్ ఫీజుతో కలిపి ఏడున్నర శాతం చెల్లిస్తున్నారు. ఆర్‌సిసి కట్టుబడికి చదరపు అడుగు 1కి రూ.700లు, ఎంటిసి కట్టుబడి, రేకులు కట్టుబడికి చదరపు అడుగు 1కి రూ.380లు లెక్కన చెల్లిస్తున్నారు. ఈ ధరలను పెంచేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. అదేవిధంగా స్థలాలు, భూముల విలువలను కూడా 20శాతం నుండి 70శాతం వరకు పెంచేందుకు సన్నాహాలు చేపట్టింది. స్టాంపు డ్యూటీని పెంచకుండా స్థలాలు భూముల ధరలు పెంచితే రిజిస్ట్రేషన్ విలువలు భారీగా పెరిగి ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చే దిశలో అధికారులు తలమునకలై వున్నారు. ఇప్పటికే పేద మధ్య తరగతి ప్రజలు ఏదైనా స్థలం రిజిష్టరు చేసుకోవాలంటే స్థలం కొనుగోలు చేసేంత స్టాంపు డ్యూటీ దరిదాపులుగా వస్తుంది. దీంతో కొంతమంది అగ్రిమెంట్లకే పరిమితమవుతున్నారు. ప్రభుత్వాధికారులు దీన్ని దృష్టిలో పెట్టుకుని భారీగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విలువలు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

# నెల్లూరు కబుర్లు

## బీజేపీ ఆఫీసులో
# కాలుపెట్టిన వెంకయ్య




2014లో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత యం.వెంకయ్యనాయుడు తొలిసారిగా నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో అడుగుపెట్టారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈ నెల 11వ తేదీన నెల్లూరొచ్చిన ఆయన బీజేపీ ఆఫీసుకు వెళ్లారు. నాయకులను, కార్యకర్తలను కలసి మాట్లాడారు. కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.

# కౌన్సిల్ మీటింగ్ పెట్టండి
## - కమిషనర్‌ను కోరిన ముక్కాల



నెల్లూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం జరిగి మూడు నెలలు కావస్తోంది. నగరంలో ప్రజలు అనేక సమస్యలతో బాధలు పడుతున్నారు. ఈ సమస్యలపై తక్షణం చర్చించాల్సిన అవసరముంది కాబట్టి వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్ కమిషనర్ పివివిఎస్ మూర్తిని కోరారు. 13వ తేదీ వైకాపా కార్పొరేటర్లు పి.రూప్‌కుమార్, బొబ్బల శ్రీనివాసులు, ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు, యండి ఖలీల్ అహ్మద్, కె.సంపూర్ణ, వైకాపా నాయకులు వేలూరు మహేష్, కె.శ్రీనివాసులు, వందవాసి రంగ, సత్తార్‌లతో వెళ్లి కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. పనిలో పనిగా స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కూడా కోరారు.

# విశ్వసాయి కొత్త విద్యార్థుల వేడుక



ఇంటర్‌లో కొత్తగా చేరిన విద్యార్థులలో ఆందోళన, భయం వంటివి లేకుండా చేయడానికి సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఫ్రెషర్స్‌డే పేరుతో పరిచయ వేడుకలు నిర్వహిస్తుంటారు. ఇలాంటి వేడుకే ఈ నెల 11వ తేదీన నెల్లూరు, ఇస్కాన్ సిటీలోని విశ్వసాయి జూనియర్ కాలేజీలో జరిగింది. విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డాక్టర్ యన్.సత్యనారాయణ, ఛైర్‌పర్సన్ శ్రీమతి రుక్మిణిలు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకను ప్రారంభించారు. కొత్తగా చేరే విద్యార్థులకు చదువుపై ఆసక్తి కల్పించేందుకు, వారిలోని బెరుకును పోగొట్టి చురుకుదనం కల్పించడానికి ఈ ఫ్రెషర్స్‌డేను నిర్వహిస్తున్నామన్నారు. వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మా విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండేలా ఐదంచల విద్యావిధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ఎంతో కలివిడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ జి.రాజేష్‌కుమార్, చీఫ్ ప్రిన్సిపాల్ జితేంద్ర, ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, వైస్‌ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• అదరగొట్టారు
# ఆకట్టుకున్న అమ్మ ఫర్నిచర్ ఎక్స్‌పో



పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరలలో గత ఏడేళ్లుగా అమ్మ ఫర్నీచర్ మాల్ విభిన్న ఫర్నీచర్ ఉత్పత్తులను అందిస్తోంది. ఫర్నీచర్ రంగంలో నూతన ఒరవడిని సృష్టించి నెల్లూరులో విశేషమైన గుర్తింపు పొందిన అమ్మ ఫర్నీచర్‌మాల్, ఇంటర్నేషనల్ ఫర్నీచర్ ఎక్స్‌పో ఈ నెల 9 నుండి 15వ తేదీ వరకు మినీ బైపాస్ రోడ్డులోని జిపిఆర్ కల్యాణ మండపంలో మాల్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో కొనసాగింది. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఎగ్జిబిషన్‌ను



నగరంలో ఏర్పాటు చేసి నాణ్యమైన ఉత్పత్తులను నగరవాసులకు అందిస్తున్నామన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో డైనింగ్ టేబుల్స్, సోఫాలు, అన్ని శ్రేణుల మంచాలు, దివాన్స్, ఆఫీసు టేబుల్స్, పూజా మందిరాలను ఉంచామన్నారు. చైనా, బెల్జియం, తైవాన్, స్వీడన్, మలేషియా, ఇటలీ దేశాలకు చెందిన విభిన్న ఉత్పత్తులను ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. షోరూం డైరెక్టర్లు గడ్డం సుమన్‌రెడ్డి, గడ్డం సుజన్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'బాహుబలి' సందడి

నెల్లూరులో 'బాహుబలి' సినిమా పెద్దఎత్తున సందడి చేస్తోంది. ఈ సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్ల వద్ద ఏదో జాతర జరుగుతున్నట్లుగా వుంది. 'బాహుబలి' టిక్కెట్లు దొరికితే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్లు దొరికినంతగా సంబరపడిపోతున్నారు. ఈ నెల 10వ తేదీన నెల్లూరులో మొత్తం ఆరు థియేటర్లలో సినిమా విడుదలైంది. ఈరోజుకు కూడా టిక్కెట్లు దొరకడం కష్టంగా వుంది. టిక్కెట్ల కోసం సిఫారసులు పైస్థాయిలో ఉంటున్నాయి. ఎమ్మెల్యే స్థాయి నాయకులు కూడా టిక్కెట్లకు థియేటర్ల యాజమాన్యాలకు ఫోన్‌లు చేసారు. ఇక ఆయా శాఖల అధికారులు, పోలీసులైతే సరేసరి. సినిమా విడుదలైన మొదటిరోజు బ్లాక్‌లో ఒక్కో టిక్కెట్ వేల రూపాయల్లో అమ్మడం ఆశ్చర్యం కలిగించింది. ఓ పది రోజులు ఓపిక పడితే 110రూపాయల టిక్కెట్‌తో ప్రశాంతంగా సినిమా చూడొచ్చనే స్పృహ కూడా లేకుండా వేలు పోసి టిక్కెట్లు కొన్నారు. సినిమా పిచ్చి కొందరికి అంతగా ముదిరిపోయింది మరి!

# కలెక్టరేట్‌లో వేలంపాట

నెల్లూరు కలెక్టరేట్‌లో ఆదివారం వేలంపాట జరిగింది. కార్యాలయంలోని పాత కుర్చీలు, టేబుళ్ళు, కంప్యూటర్లు వేలం వేశారు. వేలం పాటలో 18మంది పాల్గొన్నారు. పాతవస్తువులు దాదాపు రూ.1.08లక్షలు పలికాయి.

# బోర్నవిటా క్విజ్ పోటీలు




నెల్లూరు నగరంలోని పద్మావతి కమ్యూనిటిహాల్‌లో ఈ నెల 11వ తేదీ బోర్నవిటా క్విజ్ పోటీలు(సౌత్‌జోన్) పరిధిలో నెల్లూరులోని 40టాప్ స్కూల్స్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో మాడరన్ స్కూల్ విద్యార్థులు యం.యోగేష్(8వ తరగతి), ఎన్.ఉదయభాస్కర్ (7వ తరగతి) విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఏ.వి.రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

# గుడ్లు తేలేయాల్సిందే!

మార్కెట్‌లో చికెన్ ధరలు బాగానే మండుతున్నాయి. స్కిన్‌లెస్ చికెన్ కిలో 180 రూపాయల దాకా పోయింది. చికెన్‌తో పాటు కోడిగుడ్ల రేట్లు కూడా మండిపోయాయి. గత నెలలో రీటైల్‌గా ఒక్కో గుడ్డు 5రూపాయల దాకా పెరిగింది. అప్పుడు హోల్‌సేల్ మార్కెట్‌లో 4.40రూపాయలుండింది. గుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడం కారణంగా గత నెలలో రేట్లు ఆకాశాన్నంటాయి. ఇప్పుడు హోల్‌సేల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు 3.50రూపాయలే పడుతున్నా రిటైల్‌గా షాపుల్లో మాత్రం 5రూపాయల రేటునే కొనసాగిస్తున్నారు. ఇటీవలకాలంలో ఆరోగ్య కారణాల రీత్యా కోడిగుడ్ల వినియోగం బాగా పెరిగింది. మన జిల్లాలోనే రోజుకు 8లక్షల గుడ్లు దాకా ఖర్చవుతాయి. హోల్‌సేల్‌గా రేట్లు తగ్గినా రిటైల్‌గా మాత్రం ధరలు తగ్గించడం లేదు.

# ఎస్సీ కార్పొరేషన్‌కు కొత్త ఇ.డి

ఎస్‌సి కార్పొరేషన్‌కు కొత్త ఇ.డిగా వై.రామచంద్రారెడ్డి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటిదాకా ఇన్‌ఛార్జిగా వున్న ఐటిడిఏ పి.ఓ వెంకటేశ్వర్లు ఆ మేరకు ఆయన బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఇ.ఇ ప్రేమకుమారి. కార్యాలయం సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఇ.డి రామచంద్రారెడ్డికి 'లాయర్' శుభాకాంక్షలు.

# పేద ముస్లింలకు రంజాన్ సరుకులు



ఈ నెల 14న నెల్లూరు పప్పులవీధిలోని వై.వి.యం. హైస్కూలులో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో 6వ డివిజన్‌లోని పేద ముస్లింలకు రంజాన్ సరుకుల పంపిణీ కార్యక్రమానికి నెల్లూరు నగర శాసన సభ్యులు డా. పి.అనీల్‌కుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలలో అనేక మంది పేదలు ఉన్నారని, వారికి సాయం చేయాలనే మంచి మనసుతో ద్వారకానాథ్ తన సొంత డబ్బుతో నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రంజాన్ మాసంలో ఇలాంటి మంచి పనులు చేసిన ప్రతి ఒక్కరికీ ఆ భగవంతుని ఆశీస్సులుంటాయని అనిల్ పేర్కొన్నాడు. ద్వారకానాథ్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో మంచిపనిచేయాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబులు రవిచంద్ర, దేవరకొండ అశోక్, సంక్రాంతి కల్యాణ్, దార్ల వెంకటేశ్వర్లు, పోలంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, నాగభూషణం, కొండయ్య, రఘురామిరెడ్డి, లక్ష్మీనారాయణ, పఠాన్ ఫయాజ్‌ఖాన్, సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## పేదోళ్ల కాలనీలపై ప్రత్యేకశ్రద్ధ

పేదోళ్లు కాపురాలుండే కాలనీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అక్కడి సమస్యలు పరిష్కరిస్తానంటున్నాడు నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. ఈ నెల 13వ తేదీన ఆయన నెల్లూరులోని డ్రైవర్స్‌కాలనీ-1 మరియు 2లలో ప్రజాబాట కార్యక్రమం పెట్టారు. ప్రతి వీధిలోకి పోయాడు. ప్రతి ఇంటి ముందు ఆగాడు. ప్రజలను పిలిచి సమస్యలు అడిగాడు. అధ్వాన్నంగా వున్న పారిశుద్ధ్యం, కంపునీళ్లు, గతుకుల రోడ్లు, వెలగని లైట్లు, గంటసేపు కొట్టినా గట్టిగా బిందెడు నీళ్ల రాని బోర్లు... ఈ సమస్యలనే అక్కడి ప్రజలు కోటంరెడ్డికి వివరించారు. వారి సమస్యలు విన్న కోటంరెడ్డి మాట్లాడుతూ పేదప్రజలు నివసించే ఇలాంటి కాలనీలను ప్రత్యేకంగా పట్టించుకుంటానని, అధికారులతో పోరాడైనా మీ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పురుషోత్తం, నరసింహ ముదిరాజ్, కిరణ్, మాబాషా, సందాని, మున్నా, బాబూరావు, రాజేష్, శేఖర్, జావీద్, రఫీ, వాయుబ్, సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

## ఇస్రోకు శ్రీసిటీ అభినందనలు



పిఎస్ఎల్వి-సి28 ద్వారా 5ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపడంలో విజయం సాధించినందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అధ్యక్షులు కిరణ్‌కుమార్‌ను, షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్, అసోసియేట్ డైరెక్టర్ డా. యస్.వి.సుబ్బారావు, షార్ ఉద్యోగస్తులను శ్రీసిటి ఎండి రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. వాణిజ్యపరంగా జరిగిన ఈ ప్రయోగం భవిష్యత్తులో ఇస్రో చేయబోయే ఈ తరహా ప్రయోగాలకు గీటురాయన్నారు. వరుసగా 29సార్లు పిఎస్ఎల్వీని విజయవంతంగా ప్రయోగించడం ఇస్రో ప్రతిభకు నిదర్శనమన్నారు.

### • స్వర్ణభారత్ ట్రస్ట్


# విస్తరిస్తున్న సేవలు

### - వెంకయ్య స్ఫూర్తితో ముందడుగు



జిల్లాలోనే కాదు, రాష్ట్ర-జాతీయ స్థాయిలోనూ స్వర్ణభారత్ ట్రస్ట్ పేరు మారుమోగుతూనే వుంది. దేశవ్యాప్తంగా ఎందరో ప్రముఖులు, నాయకులు, శాస్త్రవేత్తలు, విజ్ఞానవేత్తలు, నిపుణులు, కళాకారులు ఇలా ఎందరెందరో నెల్లూరుజిల్లాలోని వెంకటాచలంలో వున్న స్వర్ణభారత్ ట్రస్ట్‌కు విచ్చేసి, అక్కడ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న విషయం అందరికీ తెలిసిందే. గ్రామీణ ప్రజలకు ఎంతో అంకితభావంతో సేవలందించే ఈ ట్రస్ట్‌కు స్ఫూర్తిప్రదాత బిజెపి అగ్రనేత, కేంద్రమంత్రి ముప్పవరపు వెంకయ్య నాయుడు కావడం విశేషం. జాతీయ నేతగా వుంటూ, దేశ రాజకీయాల్లో క్షణం తీరికలేకుండా బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు ప్రజాసేవా కార్యక్రమాలకు కూడా కొంత సమయం కేటాయించి ఆదర్శవంతమైన మార్గంలో పయనిస్తూ ఆయన అందరి ప్రశంసలూ అందుకుంటున్నారు. గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి అనే ధ్యేయంతో, ఎంతో సంకల్పబలంతో వెంకయ్యనాయుడు ఈ ట్రస్ట్ ద్వారా గ్రామీణప్రజలకు మరింతగా సేవలను విస్తరించేందుకు కృషి చేస్తున్నారు కూడా.

ఈ నేపథ్యంలో ఈనెల 10న వెంకయ్య నాయుడు స్వర్ణభారత్ ట్రస్ట్‌కు వచ్చినప్పుడు, ముప్పవరపు ఫౌండేషన్, అతుల్ నిషార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇక్కడ రైతు శిక్షణాకేంద్రం, యువతకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటుచేసిన కిసాన్ సమాధాన్ కేంద్రంలో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు. రైతులు ఎలాంటి పంటలు వేసుకోవాలి, పంటలకు సాధారణంగా వచ్చే తెగుళ్ళు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులు అధునాతన సాగు యాజమాన్య పద్ధతులతో ఎలా దిగుబడులు పెంచుకోవచ్చు తదితర విషయాలన్నిటినీ రైతులకు తెలియజేసేందుకు ఇక్కడ వ్యవసాయశాస్త్రవేత్తలు అందుబాటులో వుంటారని వెంకయ్య నాయుడు ఈ సందర్భంగా పేర్కొన్నారు. వారానికోసారి ఇక్కడ రైతు సదస్సులు ఏర్పాటు చేసి రైతుల సందేహాలను తీరుస్తారన్నారు. దేశజనాభాలో 65 శాతం దాకా వున్న యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇవ్వగలిగితే ప్రపంచంలోని అన్ని దేశాల సాంకేతిక అవసరాలను మన యువత తీర్చగలుగుతుందని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు అన్నారు. తద్వారా విజ్ఞానంలో మన దేశం విశ్వగురువుగా మారుతుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్యక్షులు శ్రీరామదొరై, రాష్ట్ర వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్యక్షులు గ్రంథి మల్లికార్జునరావు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌తో పాటు, అతుల్ నిషాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అతుల్ నిషాద్, ముప్పవరపు ఫౌండేషన్ ట్రస్టీ ముప్పవరపు రాధ, స్వర్ణభారత్ ట్రస్ట్ ఛైర్మెన్ విష్ణురాజు, సీనియర్ శాస్త్రవేత్త మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మా రవికి శుభాభినందనలు





సోమవరపు కృష్ణారెడ్డి - ఇందిరమ్మల గారాల తనయుడు,
సింహపురి ముద్దుబిడ్డ, పేదప్రజల సంక్షేమానికి నిరంతర కృషి చేస్తున్న విజ్ఞానవేత్త
**శ్రీ సోమవరపు రవికుమార్‌రెడ్డి**
("REEDS" (Rural Economic and Educational Society) నిర్వాహకులు)
అమెరికన్ సెంటినల్ యూనివర్శిటీ నుంచి
"డాక్టర్ ఆఫ్ లెటర్స్" పురస్కారం అందుకొని
సింహపురి సీమకే గర్వకారణంగా నిలిచిన సందర్భంగా
మా ఆత్మీయ అభినందనలు

గండవరపు శ్రీనివాసులురెడ్డి
ఇ.ప్రతాప్
టి.నిరంజన్‌రెడ్డి
వి.మోహన్‌రెడ్డి
మారుతి మోటార్స్, నెల్లూరు.



# 'కామధేను' అవసరాలు చూడండి

చింతలదేవి వద్ద ఏర్పాటు చేయనున్న జాతీయ కామధేను బ్రీడింగ్ కేంద్రానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగిన ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి డా॥ మన్మోహన్‌సింగ్ పేర్కొన్నారు.

సోమవారం నెల్లూరు కలెక్టర్ బంగ్లాలో జాతీయ కామధేను బ్రీడింగ్ కేంద్రానికి అవసరమైన ఏర్పాట్ల పనులపై జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా జాతీయ కామధేను బ్రీడింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో భాగంగా మేలుజాతి పశువులను అభివృద్ధి పరిచేందుకు అవసరమైన షెడ్లను పటిష్టంగా వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలో వున్న పాతషెడ్లను తొలగించి వాటి స్థానంలో కొత్త షెడ్లను ఏర్పాటు చేయాలన్నారు. మంచినీటిని స్టోరేజ్ చేసేందుకు అవసరమైన పైపులైన్లు ఓవర్‌హెడ్ ట్యాంకులను ఏర్పాటు చేయాలని చెప్పారు. చింతలదేవి వద్ద కేటాయించిన భూములలో పశు గణాభివృద్ధికి అవసరమైన నర్సరీని, మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డా॥ పి.డి.కొండలరావు, జిల్లా అటవీశాఖాధికారి శ్రీకంఠనాథరెడ్డి, పశుసంవర్ధకశాఖ జె.డి. శ్రీధర్, వ్యవసాయశాఖ జె.డి వేణుకృష్ణ, కావలి ఆర్‌డిఓ నరసింహన్, డ్వామా పి.డి రామచంద్రారెడ్డి, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయచంద్రారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ రెడ్డయ్య, భూగర్భజల శాఖ డి.డి రమేష్‌కుమార్, పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, కొండాపురం మండలానికి చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు కాదు పిడుగులనిపించారు



పిల్లలు కాదు పిడుగులని నిరూపించారు డా॥ కిషోర్ రత్నం రేస్ ఇంటర్నేషనల్ విద్యార్థులు. పసితనంలోనే వివిధ ఆకృతులను తయారుచేసి అబ్బో అనిపించారు. ఈ నెల 15వ తేదీ నెల్లూరు సరస్వతీనగర్‌లో వున్న ఈ స్కూల్‌లోని 5వ తరగతిలోపు విద్యార్థులకు 'ఆక్టివిటి ఆన్ క్రియేటివిటి' ప్రోగ్రామ్ జరిగింది. విద్యార్థులు పూలతో వివిధ ఆకృతులను, బొకేలను అద్భుతంగా తయారు చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డా॥ కిషోర్స్ రత్నం జన్‌నెక్ట్స్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ చిన్నారులకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల చిన్నతనం నుండే విద్యార్థులకు సృజనాత్మక శక్తి, నైపుణ్యం అలవడుతుందన్నారు. విద్యార్థులు చదువులతో పాటు అన్ని రంగాల్లో ఆసక్తితో రాణించాలని, అందుకు అవసరమైన సూచనలు, సలహాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చిన్నారులకు అందివ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డా॥ కిషోర్స్ రత్నం రేస్ ఇంటర్నేషనల్ ప్రిన్సిపల్ రేవతి, కిడ్స్ ఇంటర్నేషనల్ ప్రిన్సిపల్ లక్ష్మి, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, ఏ.ఓ సునీల్‌కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఓటు హక్కుకు ఆధార్ లింకు

ఓటు హక్కుకు ఆధార్ లింకును ఎన్నికల సంఘం శరవేగంగా పూర్తి చేస్తోంది. ఆధార్ లింకు వల్ల నకిలీ ఓట్లన్నీ ఎగిరిపోయే అవకాశముంది. నెల్లూరుజిల్లాలో కూడా చాలావేగంగానే ఓటుకు ఆధార్ లింకు ప్రక్రియ జరిగింది. దాదాపు 4నెలల పాటు అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించడంతో పాటు ఇంటింటికి వెళ్లి ఆధార్ వివరాలు సేకరించి 80శాతానికి పైగా ప్రక్రియను పూర్తి చేశారు. అయినా కూడా ఇంకా లక్షా 50వేల మంది ఓటర్లు తమ ఆధార్ నెంబర్లు ఇవ్వలేదు. ముఖ్యంగా గూడూరు డివిజన్‌తో పాటు నెల్లూరురూరల్ ఈ విషయంలో వెనుకబడ్డాయి. ఈ ఓటర్లు కూడా ఆధార్‌తో అనుసంధానమైతే జిల్లాలో పూర్తిస్థాయి ఓటర్ల జాబితాను రూపొందించడానికి అవకాశముంటుంది. మిగిలిన ఓటర్లను కూడా వేగంగా ఆధార్‌తో అనుసంధానించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది.

# ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తా

## - ఛైర్‌పర్సన్ దేవసేన



విద్యార్థులకు బహుమతులందజేస్తున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, పక్కన శివకుమార్‌రెడ్డి, రియాజ్ అహ్మద్ తదితరులు

ముస్లింల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని గూడూరు పురపాలక ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరులోని షాది మంజిల్‌లో ఆదివారం మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. పేద ముస్లిం బాలికలు విద్యకు దూరం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వారిని చేర్పించాలని కోరారు. నెట్‌వర్క్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీల బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాలిక విద్య బలోపేతానికి తాము కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో 9పాయింట్లు పైబడి సాధించిన పేద ముస్లిం విద్యార్థులు 20మందికి వెయ్యి రూపాయల చొప్పున అందజేశారు. రంజాన్ సందర్భంగా రూ.70వేలు విలువ చేసే చీరలు, లుంగీలను పేద ముస్లింలు 300మందికి పంపిణీ చేశారు. 75మంది 9, 10 తరగతుల విద్యార్థులకు రెండు జతల దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త, తెలుగుదేశం నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి, నెట్‌వర్క్ ఉపాధ్యక్షుడు కరీముల్లా, కార్యదర్శి మహబూబ్ బాషా, కోశాధికారి కరీముల్లా, సభ్యులు ఇస్మాయిల్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# 'నెల్‌క్యాస్ట్' వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న కె.సుందరరామిరెడ్డి, నెల్‌క్యాస్ట్ సిబ్బంది

గూడూరు నెల్‌క్యాస్ట్ ఆధ్వర్యంలో వనమహోత్సవ దినం సందర్భంగా బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం చేశారు. నెల్‌క్యాస్ట్ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నెల్‌క్యాస్ట్ శ్రేయోభిలాషి కె.సుందరరామిరెడ్డి, నెల్‌క్యాస్ట్ మేనేజ్‌మెంట్ తరపున జనరల్ మేనేజర్ అడ్మినిస్ట్రేషన్ యన్.ఎస్.రెడ్డి, జనరల్ మేనేజర్ ఫైనాన్స్ దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి మొక్కలు నాటిన అనంతరం మాట్లాడుతూ ఈ సీజన్‌లో 1500మొక్కలు నెల్‌క్యాస్ట్ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు డి.మునిచంద్రయ్య, సిహెచ్ శ్రీనివాస రావు, టి.మురళీకృష్ణ, కంపెనీ పిఆర్ఓ ఆనిమెళ్ళ శివకుమార్, మేనేజర్లు పి.రామ్మోహన్‌రావు, కె.దామోదర్‌రెడ్డి, గోవిందరాజన్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎన్.శ్రీనివాసమూర్తి, వి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా జగన్నాథ రథయాత్ర

గూడూరులో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ శ్రీ జగన్నాథ రథయాత్ర 11వ తేదీ సాయంత్రం వైభవంగా జరిగింది. స్థానిక డివిఆర్ కమ్యూనిటీ హాలు సమీపంలో ప్రారంభ సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఇస్కాన్ ఆధ్వర్యంలో జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు జరుపుతున్నారన్నారు. నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఉచితంగా అందించారన్నారు. అదేవిధంగా గూడూరు పాఠశాలల్లోనూ అమలు చేయాలన్నారు. ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ వ్యక్తికి విలువలతో కూడిన జీవితం ఎంతో అవసరమని, ఆధ్యాత్మిక జీవితంతో ఎంతో సంతోషంగా ఉండవచ్చని తెలిపారు. అనంతరం రథయాత్రను ప్రారంభించారు. రథయాత్రలో ప్రత్యేకంగా భగవన్నామకీర్తనలు, సుందర నృత్యాలు, వీధుల్లో రంగవల్లులు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఎద్దుల బండ్లు, మహాప్రసాదాల వితరణ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్, ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు సుకదేవస్వామి, కో-ఆర్డినేటర్ భానుప్రకాష్, ప్రతినిధులు ప్రభు, కృష్ణప్రభు, రమణారెడ్డి, శ్యాంయాదవ్, భక్తులు పాల్గొన్నారు.

## చేడిమాల

# భూసమస్యలు పరిష్కరించండి

చిల్లకూరు మండలం చేడిమాలలో నెలకొన్న భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో రవీందర్‌కు మాజీమంత్రి బల్లి దుర్గాప్రసాద్‌రావు సోమవారం జరిగిన ప్రజావిజ్ఞప్తుల దినంలో వినతిపత్రాన్ని అందజేశారు. భూస్వాముల ఆధీనంలో భూములు ఉన్నాయని, వెంటనే వాటిని బాధితులకు అందజేయాలని కోరారు. తిలక్‌నగర్‌లో మంచినీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికుడు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. గతంలో ఎన్నోసార్లు సమస్యను చెప్పినా పట్టించుకోలేదని, మంచినీటి బోరును మంజూరు చేయాలని కోరారు. పట్టణంలోని సాయిబాబా మందిరం సమీపంలో వున్న పెట్రోల్‌బంకు కొలతల్లో తేడా వస్తుందని, గతంలో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోలేదని, దీన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని బీజేపీ మైనార్టీ నాయకులు తాజుద్దీన్ ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఇంకా పలు గ్రామాల నుంచి ప్రజలు భూసమస్యలపై ఫిర్యాదులు ఇచ్చారు.

# కార్మిక వ్యతిరేక విధానాలు వీడండి

## సిపిఐ జిల్లా కార్యదర్శి పార్థసారథి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను నిరంతరం అవలంభిస్తున్నాయని, వెంటనే వాటిని విరమించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పార్థసారధి అన్నారు. గూడూరులోని తాలూకా ఆఫీసు రోడ్డులో పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని ఆదివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు పని చేయాలన్నారు. ఈ నెల 20న దేశంలోని వామపక్ష పార్టీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు నాయకులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. కాగా, గతంలో సిపిఎం పార్టీలో పనిచేసిన కాలేషా సిపిఐలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, నిరంజన్, గౌస్ బాషా, నారాయణ, కుమార్, భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆదాయ వ్యయాలు సంతృప్తికరము. అదనపు ఖర్చులకు సిద్ధపడతారు. వృత్తి జీవనము కలవారికి లాభసాటిగా ఉంటుంది. వ్యాపారాలలో మీ ఆలోచనలు ముందు జాగ్రత్తలు మేలు కలిగిస్తాయి. బాకీలు కొంత మేరకు లభించగలవు. చేపట్టిన పనులు సక్రమంగా జరుగుతాయి. ఉద్యోగ నిర్వహణలో ఇబ్బందులు తొలగి అధికారులతో ఉద్యోగులకు సామరస్యత ఏర్పడుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, శ్రమ ఎక్కువగా ఉండి అధికారుల వత్తిడి పెరుగుతుంది. యజ్ఞ సంబంధ మగు దైవకార్యాలలో పాల్గొంటారు. దూరప్రయాణాలు, ఖర్చులు అదనంగా ఉంటాయి. అనుకున్న పనులు శ్రమతో నెరవేర్చుకొంటారు. శుభకార్య ప్రయత్నాలు నిదానిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సంతృప్తి కరం. అదనపు రెమ్యూనరేషన్లు లభించవచ్చును.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

తొందరపాటు తగ్గించుకొని, సమస్యలు రాకుండా చూచుకొనాలి. బంధువర్గం వల్ల ఇబ్బందులు రావచ్చును. యంత్రాలతో పనులందు, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త వహించవలసి వుంటుంది. ఆదాయం ఖర్చులు సరిపోతుంటాయి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం, కోర్టు కేసులు వ్యవహారాలలో వ్యతిరేకత ఉంటుంది. బాకీలు నిలబడిపోతాయి. ఆరోగ్యం జాగ్రత్త.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉపాధి పథకాలు, వ్యాపారాలు అభివృద్ధికరంగా సాగుతాయి. వృత్తి పరంగా గుర్తింపు గౌరవాలు, రాబడి పెరుగుతుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాలను, కోర్టు వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఉద్యోగులు, అధికారులు అదనపు పనులతో విశ్రాంతి లేకుండా పనిచేస్తారు. ఉద్యోగార్థు లకు అవకాశాలు లభించగలవు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 17.07.2015 నుండి
తేది. 23.07.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, మిధునంలో రవికుజ బుధులు, 20తేది నుండి కర్కాటకంలో బుధుడు, సింహంలో గురుశుక్రులు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, కర్కాటక సింహ కన్య తులా రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 17 శుక్రవారము దక్షిణాయన పుణ్యకాలము

### నిజాషాఢ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 17 | శుక్ర | పాడ్యమి | ఉ॥ గం.6.45ని॥ |
| తేది. 18 | శని | విదియ | ఉ॥ గం.7.44ని॥ |
| తేది. 19 | ఆది | తదియ | ఉ॥ గం.9.06ని॥ |
| తేది. 20 | సోమ | చతుర్ధి | ఉ॥ గం.10.54ని॥ |
| తేది. 21 | మంగళ | పంచమి | ప॥ గం.12.05ని॥ |
| తేది. 22 | బుధ | షష్ఠి | ప॥ గం.2.51ని॥ |
| తేది. 23 | గురు | సప్తమి | సా॥ గం.4.44ని॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలు స్థబ్దుగా ఉంటాయి. ఆశించిన రాబడి ఉండకపోవచ్చు. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. కొత్త పెట్టుబడులకు అవకాశాలు, భాగ స్వామ్యాలు లభించగలవు. నిర్ణయాలు జరిగినంత వేగంగా పనులు జరగవు. ఇతరులతో విభేదాలు సర్దుబాటు కాగలవు. అనవసర వివాదాలలో జోక్యం చేసి కొనవద్దు. వ్యవహారాలలో పట్టువిడుపులతో సాగండి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యవహారాలు ఒప్పందాలలో తొందరపడవద్దు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా ఉండి అభివృద్ధి ఉంటుంది. ఆర్థికాభివృద్ధికి ఆకర్షణీయమైన ప్రణాళికలు రూపొం దిస్తారు. ఖర్చులు అదనంగా ఉండినా ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. ఆత్మీయుల నుండి శుభవార్తలు వింటారు. ఉద్యోగులు, అధికారులు పబ్లిక్‌తో జాగ్రత్తగా ఉండండి. ఆరోగ్యం ఫరవాలేదు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి, రాబడి పెరుగుతుంది. కొన్ని అదనపు ఖర్చులుండినా ఆర్థిక ఇబ్బందులు బాధించవు. కుటుంబ సౌఖ్యం ఉంటుంది. శుభవార్తలు వినడం, శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. కొన్ని పనులు శ్రమలేకుండా అనుకూలం కాగలవు. ఆర్థిక వ్యవహారాలలో అప్రమత్తంగా ఉండండి. ఇతరులకు సహాయపడతారు. బాకీలు నిలబడిపోతాయి.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారాలలో ఆకర్షణీయ పథకాలు ప్రణాళికలతో ముందుకు సాగుతారు. ఈ రాశి వారికి ఆర్థిక పరిస్థితి కొంత మేలుగా ఉంటుంది. ఖర్చులు పెరిగినా జాగ్రత్తలు తీసికొంటారు. దైవ కార్యాలు, శుభకార్యాలలో పాల్గొం టారు. దూర ప్రయాణాలుంటాయి. ప్రభుత్వ అనుమ తులు ఆలస్యం కాగలవు. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. కుటుంబసౌఖ్యం ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

దైవ, శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణా లుంటాయి. బంధువర్గంలో అనారోగ్యవార్తలు వింటారు. చేపట్టిన పనులకు అనుకూలత బాగుంటుంది మరియు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారా లలో ఆదాయం, ప్రాపకం పెరుగుతుంది. కాంట్రాక్టులు, లీజులు పొడిగింపబడటం, ప్రభుత్వ అనుమతులు లభించడం, షేర్లు పెట్టుబడుల మీద లాభాలుండగలవు. ఉన్నత విద్యావకాశాలు దొరకగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి, ఉపాధి పథకాలు సంతృప్తికరంగా ఉంటాయి. దైవ, సామూహిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రయాణాలు శ్రమపెడతాయి. వ్యాపార విస్తరణ, కొత్త పెట్టుబడులకు, డబ్బు మదుపుకు అవకాశాలుంటాయి. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. పరిచయాలు వ్యాపకాలు పెంచుకొంటారు. కోర్టు వ్యవహారాలు, క్రయ విక్రయాలు వాయిదా పడటం జరుగుతుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఏ పనినైనా బాగా ఆలోచించి, పెద్దల సలహాలు పాటించి చేయండి. తొందరపాటు తనం ఎక్కువగా ఉండి ఇబ్బందులుపడే అవకాశం కలదు. ఆదాయం, ఖర్చులు ఫరవాలేదనిపించగలవు. వృత్తి వ్యాపారాలలో పెరుగుదలకు కృషి చేస్తారు మరియు ఆదాయం పెంచు తారు. బాకీలు కొంతవరకు అందుతాయి. నూతన వస్తు వులు సమకూర్చుకొంటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

చేపట్టిన పనులు త్వరగా జరగడం, బంధుమిత్రుల సహకారం బాగుండటం ఉంటుంది. ఉద్యోగార్థులకు కొత్త అవకాశాలు లభించగలవు. ఉద్యోగులకు స్థాన చలనం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం పెరుగుదల ఉంటుంది. ప్రతి విషయంలో టెన్షన్ పడు తుంటారు. ఆరోగ్యం బాగుంటుంది. ఆత్మీయులను కలుసు కొంటారు. అదనపు ఖర్చులుంటాయి.

# నాయకుల పాపాలకు ఆవిరైన గోదావరి

శ్రీను గల్పిక

హైటెక్ రత్న ఆంధ్రా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో గల ఏపి సచివాలయంలోని తన ఛాంబర్‌లో కూర్చుని వున్నాడు. జిల్లా కలెక్టర్లు, తహశీల్దార్‌లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ మొదలైంది. కృష్ణా జిల్లా నుండి తహశీల్దార్ పంకజాక్షి మాట్లాడుతూ... సార్, మేము ఇసుక అక్రమరవాణాను అడ్డుకుంటుంటే మీ పార్టీ ఎమ్మెల్యేలే మా మీద దాడులకు దిగుతున్నారు. ఇదేం అన్యాయం సార్, మాకు రక్షణ ఎక్కడుంది సార్ అని అడిగింది. చంద్రబాబు స్పందిస్తూ... అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోమన్నది మా పార్టీ వాళ్లు చేసే అక్రమరవాణాను కాదు, ఎక్కడన్నా ప్రతి పక్షం వాళ్లు చేస్తుంటే! అయినా అక్రమ రవాణా అధికారంలో ఉన్నప్పుడు కాక ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేయగలుగు తారా? మీకు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునే శక్తి ఉంటే అడ్డుకోండి, దెబ్బలు తగిలితే ఆసుపత్రి ఖర్చులు మాత్రం ప్రభుత్వమే భరిస్తుందని చెప్పాడు. తర్వాత చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్‌లో 'చెట్టు-గట్టు', 'నీరు-బీరు', 'వనం-జనం' వంటి కార్యక్రమాలను సమీక్షించి ముగించారు. అప్పుడే మంత్రులు మాణిక్యాలరావు, దేవినేని ఉమ, పత్తి పాటి పుల్లారావు, పి.నారాయణ, రావెళ్ల కిషోర్‌బాబు, కొల్లు రవీంద్ర, అచ్చెన్నా యుడులు వచ్చారు. చంద్రబాబు వారితో గోదావరి పుష్కరాల గురించి మాట్లా డుతూ... పుష్కరాలకు రాష్ట్రపతిని, ఉప రాష్ట్రపతిని, ప్రధానిని, కేంద్రమంత్రులను ఆహ్వానించాం, ఇంకెవరెవరిని పిలుద్దా మని అడిగాడు. వెంటనే నారాయణ... అదేంటి సార్, అసలోళ్లను మరచిపోయా రని అడిగాడు. చంద్రబాబు ఆశ్చర్యంగా ముఖంపెట్టి అసలోళ్లా... వాళ్లెవరు అని అడిగాడు. సింగపూర్ ప్రధానిని పిలి చారా...? రాజధాని నిర్మాణాన్ని లీజుకు తీసుకునే కంపెనీ వాళ్లను పిలిచారా? జపాన్ ప్రధానిని, అధ్యక్షుడిని పిలిచారా? మనమిప్పుడు ఓట్లేసిన జనాన్ని మరచి పోయినా నష్టమేమీ లేదు గాని, వీళ్లను మరచిపోతే ఎట్లా? అని ప్రశ్నించాడు. చంద్రబాబు నాలిక్కరుచుకుని భలే గుర్తుచేసావు నారాయణ... ఇప్పుడే అందరికీ ఫోన్‌లు చేసి పిలుస్తానంటూ ముందు ఆ పని చేసేసాడు. అంతలో అక్కడకు బీజేపీ నాయకుడు కన్నా లక్ష్మీ నారాయణ వచ్చాడు. రావడంతోనే ఆవేశంగా పుష్కరాలకు 1500కోట్లు ఖర్చుంటున్నారు, అక్కడ చూస్తే అంత సీనేమీ లేదు. వందకోట్ల ఖర్చు కూడా కనిపించడం లేదు. మిగతా నిధులన్నీ తినేసారా? అని ఆవేశంగా ప్రశ్నించాడు. అప్పుడు చంద్రబాబు...ఇది కంటికి కనిపించే ఖర్చు కాదు, కేవలం ఘాట్లు, రోడ్లకే ఇన్ని కోట్లు పెట్టామనుకుంటు న్నారా? గోదావరిలో నీళ్లు నింపడానికి ఇంత ఖర్చయ్యిందన్నాడు. గోదావరిలో నీళ్లు నింపడమేంటని కన్నా ఆశ్చర్యంగా అడిగాడు. పోయిన పుష్కరాలకు గోదా వరికి వరదలొచ్చాయి. నీళ్లకు ఇబ్బంది లేకుండా వుండింది. కాని ఈసారి ఎండలు తప్ప వర్షాలు లేవు. గోదావరి ఎండిపోయింది. చుక్క నీళ్లు లేవు. కాని పుష్కరాల టైం దగ్గరకొచ్చింది. భక్తులు ఎక్కడ మునగాలి, వచ్చిన వాళ్లు మునగ కుండా నిరాశగా వెనక్కిపోకూడదు. అందుకే బయట నుండి ట్యాంకర్ల ద్వారా గోదావరి ఘాట్ల వద్ద నీటిని నింపాం. ఈ ట్యాంకర్ల నీళ్లతో గోదావరిని నింప డానికే ఇన్ని డబ్బులు ఖర్చయిపోయా యని చంద్రబాబు చెప్పాడు. ఆ మాటతో కన్నా లక్ష్మీనారాయణ కళ్లు బైర్లు కమ్మి కిందపడ్డాడు.

★★★★★

అది రాజమండ్రి నగరం. కోటి లింగాలరేవు ఘాట్. భక్తుల రద్దీతో ఆ ప్రాంతం కిటకిటలాడుతోంది. చంద్ర బాబుతో పాటు మంత్రులు, అధికారులు, ఎమ్మెల్యేలు, స్వామీజీలు, బాబాలు అఖండ హారతితో పుష్కరాలను ప్రారం భించారు. తర్వాత చంద్రబాబు గోదా వరిలో మూడు మునకలు మునిగి పైకి వచ్చాడు. అక్కడే వున్న పరిపూర్ణానంద స్వామితో... స్వామి, గోదావరిలో ఒక పుష్కరంలో మునిగితే పాపాలు పోవా? ప్రతి పుష్కరంలోనూ మునగాల్సిందేనా అని చంద్రబాబు తన ధర్మ సందేహం వెలిబుచ్చాడు. అందుకు ఆయన... పుష్కరాలు 12ఏళ్లకు ఒకసారి వస్తాయి నాయనా, కాని మనం పాపాలు రౌండ్‌ది క్లాక్ చేస్తూనే ఉంటాం నాయనా, 12 ఏళ్లకోసారన్నా గోదావరిలో మునిగి ఈ పాపాలను కడిగేసుకుంటేనా కదా ఫ్రెష్‌గా వుంటామని చెప్పాడు. అప్పుడు అక్కడకు సోనియాగాంధీ, ప్రియాంక, రాబార్ట్ వాద్రా, మన్మోహన్‌సింగ్, సురేష్‌కల్మాడీలు వచ్చారు. సోనియా నేరుగా ఆ స్వామీజీ వద్దకెళ్లి... స్వామి ఈ నీటిలో మునిగితే మా పాపాలన్నీ పోతాయా అని అడిగింది. దానికి స్వామి... మీరు చేసిన పాపాలన్నీ పోవాలంటే నిముషం, రెండు నిముషాలు మునిగితే సరిపోదమ్మా, జీవితాంతం మునుగుతుండాల్సిందే, ముఖ్యంగా మీ అల్లుడు రాబర్ట్‌ను, ఆ సురేష్ కల్మాడీని బాగా ముంచండి అని చెప్పాడు. వాళ్లు అలా వెళ్లిపోయాక కనిమొళి, ఏ.రాజా, మధుకోడాలు వచ్చారు. వాళ్లు కూడా పరిపూర్ణానంద స్వామి వద్దకెళ్లి... స్వామీ గోదావరిలో మునిగితే మా తప్పులు ప్రాయశ్చిత్తమవుతాయా అని అడిగారు. ఒక్క గోదావరిలోనే కాదు నాయనా, ప్రపంచంలో వున్న అన్ని నదుల్లో మునిగినా మీ పాపాలు తొలిగి పోయేవి కావు. మీరు చేసినవేమన్నా చిన్న స్కాంలా... గోదావరిలో మునగగానే మీ పాపాలు పోయేపనైతే దావూద్ ఇబ్రహీం, చార్లెస్ శోభరాజ్ లాంటివాళ్లు కూడా వచ్చి మునగరా... అని చెప్పాడు. ఈ బ్యాచ్ కూడా మునగడానికి వెళ్లిన తర్వాత సుష్మాస్వరాజ్, వసుంధర రాజేలను వెంటబెట్టుకుని నరేంద్రమోడీ వచ్చాడు. మీరే పాపం చేసారు మోడీజీ అని పరిపూర్ణానంద స్వామి అడిగాడు. మోడీ అందుకు... వాళ్లను చూపిస్తూ ఒకరిని ముఖ్యమంత్రి, ఇంకొకరిని కేంద్రమంత్రి చేయడమే నేను చేసిన తప్పు. వాళ్ల పాపాలు నాకు చుట్టుకుంటున్నాయి. వీళ్లను గంగలో ముంచుదామంటే ఇప్పుడల్లా పుష్కరాలు లేవు. కనీసం గోదావరిలో నైనా ముంచి పాపాలను కడిగేద్దామని తీసుకొచ్చానన్నాడు. వీళ్ల తర్వాత వై.యస్. జగన్మోహన్‌రెడ్డి బ్యాచ్ కూడా వచ్చి మునిగింది. ఆ తర్వాత ఆయా అవినీతి కుంభకోణాల్లో వున్న పలువురు నాయకులు ఘాట్ వద్దకు వెళ్లారు. చంద్రబాబు, మంత్రులు, సోనియా, రాబర్ట్, రాహుల్, మన్మోహన్‌సింగ్, సురేష్‌కల్మాడి, రాజు, కనిమొళి, జగన్, సుష్మాస్వరాజ్, వసుంధర రాజే... అందరూ ఒకేసారి ఘాట్ మెట్లపై నుండి నీళ్లలోకి దిగారు. ముక్కు మూసుకుని నీటిలో మునిగారు. నాలుగు సెకన్ల తర్వాత పైకిలేచారు. ఆశ్చర్యం... అక్కడ ఒక్క బొట్టు నీళ్లు లేవు. వీరితో పాటు అక్కడ వున్న భక్తులంతా కూడా ఆశ్చర్య పోయారు. గోదారమ్మ ఆగ్రహించిం దంటూ కేకలు పెట్టసాగారు. ఆ కేకలు విని పరిపూర్ణానంద స్వామి ఘాట్ వద్దకు పరుగెత్తుకొచ్చాడు. గోదావరి ఎండి పోవడం చూసి ఆయన గుండె చెరువైంది. మీ పాపాల వేడికి ఆ గోదారి తల్లి కూడా ఆవిరైపోయింది. మీరు మునిగితే నదులేం ఖర్మ, సముద్రాలు కూడా ఎండిపోతాయని అంటుండగా ... చంద్రబాబు తాపీగా పైకొచ్చి పరిపూర్ణానంద స్వామితో.. స్వామీ, మీరేం దిగులుపడకండి, ఇంకో వెయ్యి కోట్లు ఖర్చయినా ఫర్వాలేదు, గోదావరిలో నీళ్లు నింపుతానంటూ వెళ్లి పోయాడు. ఆ మాటకు పరిపూర్ణానంద అలాగే నోరెళ్లబెట్టాడు.



రాజేశ్వరమ్మ కుటుంబసభ్యులకు 10లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ సోమిరెడ్డి

# పుష్కర మృతుల్లో నెల్లూరు మహిళలు

మహాపుష్కరాల సందర్భంగా 14వ తేదీ రాజమండ్రిలోని కోటగుమ్మం ఘాట్ వద్ద జరిగిన తొక్కిసలాటలో నెల్లూరుకు చెందిన పర్వతాల రాజేశ్వరమ్మ(40), కొండూరు జానకమ్మ(60)లు ప్రాణాలు కోల్పోయారు. పర్వతాల రాజేశ్వరమ్మ నెల్లూరులోని పెద్దాసుపత్రి ఎదురు సందులో వుంటుంది. ఆమె భర్త పోలయ్య ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. రాజేశ్వరమ్మకు భక్తిభావం ఎక్కువ. ప్రతి పుష్కరాలకు కూడా ఆమె వెళ్తుంటుంది. 12ఏళ్ల క్రితం వచ్చిన గోదావరి పుష్కరాలకు కూడా కుటుంబసభ్యులతో భద్రాచలం వెళ్లి పుణ్యస్నానాలను ఆచరించింది. ఈసారి రాజమండ్రికి వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంది. అలాగే ఓజిలి మండలం భువనగిరిపాళెంకు చెందిన కొండూరు జానకమ్మ కూడా అక్కడ జరిగిన తొక్కిసలాటలో మరణించింది. బుధవారం వీరిద్దరి అంత్యక్రియలు జరిగాయి. నెల్లూరులోని రాజేశ్వరమ్మ ఇంటికి వెళ్ళి ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్, కలెక్టర్ ఎం.జానకిలు నివాళులర్పించారు. ప్రభుత్వం నష్టపరిహారంగా అందజేసిన 10లక్షల రూపాయల చెక్కును వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అందజేశారు. అలాగే భువనగిరిపాళెంలో కొండూరు జానకమ్మ అంత్యక్రియలు నిర్వహించగా ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మాజీమంత్రి పరసా రత్నం, నాయుడుపేట ఆర్డీవో బాబయ్య, పలువురు నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతులకు ప్రభుత్వం అందజేసిన 10లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి వారి కుటుంబసభ్యులకు అందజేశారు.

# వైద్యశిబిరాలతో పేదలకు వైద్యం



స్వచ్ఛంధ సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల మూలంగా మారుమూల ప్రాంతాల్లో ఉండే పేద ప్రజలకు మంచి వైద్యం లభిస్తుందని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ నెల 11వ తేదీన నెల్లూరు, పడారుపల్లిలోని ఆచార్య పి.సి.రెడ్డి సమాజమందిరంలో యంగ్ ఇండియా వాలంటరీ ఆర్గనైజేషన్ మరియు క్రాంతి మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య చికిత్సా శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతాల్లో నెలకోసారన్నా విధిగా వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. క్రమం తప్ప కుండా క్రాంతి మహిళా మండలి చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినం దించారు. ఈ శిబిరంలో పలువురు వైద్యులు పాల్గొని 200మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు శ్రీమతి జి.వెంకటలక్ష్మి ఈ వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తూ రోగులకు ఉచిత భోజనం కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఇంకా శాంతిలాల్ జైన్, వైద్యులు మంజులమ్మ, సి.హెచ్. మురళీకృష్ణ, యస్.సునీల్‌కుమార్, వొమ్మిన సుబ్రహ్మణ్యం, టి.సుకుమార్‌రెడ్డి, టి.కృష్ణారెడ్డి, పాతపాటి పుల్లారెడ్డి, ఉమాదేవి, సత్యవాణి, కొండా శేఖర్‌రెడ్డి, బయ్యా ప్రసాద్, లక్ష్మీనారాయణ, గడ్డం సుధాకర్‌రెడ్డి, డి.రాధాకృష్ణ, జి.రాజగోపాల్‌రెడ్డి, ఆర్.లక్ష్మి, పి.విజయ్‌మోహన్‌రెడ్డి, వి.శ్రీనివాసులురెడ్డి, కె.కుసుమకుమారి, యంగ్ ఇండియా వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు గుమ్మడి పవిత్ర, జి.అఖిల, కె.ప్రవల్లిక, వై.ఊర్మిల, కె.మానస, పి.ప్రజ్ఞ, జి.వైష్ణవి, కె.రేష్మా, యం.కాంచన, ఖుషీఫా, బి.బికీర్షా, జి.కీర్తి, కె.ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్యవైశ్య మహాసభలో తిరివీధి

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అసోసియేట్ ప్రధాన కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన తిరివీధి ప్రకాశరావును నియమించారు. రెండేళ్ల పాటు ఈయన ఈ పదవిలో వుంటారు. గతంలో ప్రకాశరావు ఆర్యవైశ్య సంఘంలో పలు పదవులు నిర్వహించి అందరి మన్ననలు పొందారు.

# రద్దు చేసేవారు... మంజూరు చేయలేరా?

## ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

మాజీ సైనికోద్యోగులకు, పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు, పొలాల పట్టాలను రద్దు చేసే అధికారం తహశీల్దార్‌కు ఉన్నప్పుడు, తిరిగి వారికి మంజూరు చేసే అధికారం ఎందుకు లేదని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు.

సోమవారం ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. స్థానిక ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో పట్టణంలోని గాయత్రినగర్‌కు చెందిన మాజీ సైనికోద్యోగి పఠాన్ తాజుద్దీన్‌కు తాళ్ళపాళెం గ్రామంలో గతంలో ప్రభుత్వం 5ఎకరాల భూమిని మంజూరు చేశారని, అది నేడు ఆక్రమణకు గురైందని బాధితుడు వివరించగా ఎమ్మెల్యే ఈ విషయమై తహశీల్దార్‌ను వివరణ అడగగా తహశీల్దార్ సాంబశివ రావు గతంలో వున్న తహశీల్దారు దీనిని రద్దు చేశారని చెప్పడంతో, ఇప్పుడు మీరు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. వెంటనే ఎంఆర్‌ఓ పట్టాలను మంజూరు చేసేది మా పరిధిలో లేదనడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇచ్చిన పట్టాలను రద్దు చేసేది మీ పరిధిలో ఎలా ఉంటుందని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానన్నారు. అలాగే బుడంగుంట ఇందిరమ్మ కాలనీ సమీపంలో వెంకయ్య అనే దళితునికి ఇచ్చిన భూమిని కూడా భూస్వాములు ఆక్రమించి ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ, పేదల భూములను కొంతమంది భూస్వాములు ఆక్రమించి దర్జాగా తిరుగుతుంటే కనీసం పేద వారికి కేటాయించిన స్థలాలను వారికి చూపించ లేకపోవడం దారుణమన్నారు. పచ్చచొక్కాలకే పనులు చేసే పద్ధతి మానుకొని అందరినీ సమాన దృష్టితో చూడాలన్నారు. అనంతరం ఆయన పార్టీ నాయకులతో కలసి విలేకర్లతో మాట్లాడుతూ అధికారులు ప్రజలందరినీ ఒకే దృష్టితో చూసి న్యాయం చేయాలని అన్నారు. రాష్ట్రంలో టిడిపిది దురహంకార పాలన అని దుయ్యబట్టారు. పట్టణ అభివృద్ధికి తాము అడ్డుకాదని, మున్సిపల్ ఛైర్మెన్ వ్యవహారంలో ధర్మ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ



కార్యక్రమంలో వైసిపి నేతలు కె.జగదీష్ రెడ్డి, ఎం.సుకుమార్‌రెడ్డి, పి.కామరాజు, జి.ప్రసన్న, కె.వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## కావలి కబుర్లు

# పేద విద్యార్థులకు పుస్తకాలు



పేద విద్యార్థులకు విద్య, వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో విశ్వబ్రాహ్మణ సంఘం కావలి శాఖ ఆధ్వర్యంలో 120మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు, బలపాలు, రబ్బర్లు పంపిణీ చేశారు. స్థానిక వెంగల్‌రావునగర్ శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాల నందు విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.శివరామయ్య ఆచారి అధ్యక్షతన కావలి శాఖ అధ్యక్షులు బ్రహ్మానందం ఆచారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి తహశీల్దార్ కె.సాంబశివరావు, ఎఎంసి డైరెక్టర్ తిరివీధి ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. మంచి నడవడికతో విద్యార్థులు పాఠశాలలకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. పాఠశాలలోని పరిసరాలు, విద్యార్థుల క్రమశిక్షణను గమనించిన తహశీల్దార్ హెచ్‌ఎం ఫహీముద్దీన్‌ను అభినందించారు. ఇటీవల పేద ప్రజలకు వైద్యశిబిరాన్ని నిర్వహించి నేడు పేద విద్యార్థులకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం వారిని ముఖ్యంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ నాయకులు శివాచారి, వెంకటశేషయ్యాచారి, సుబ్రహ్మణ్యాచారి, రాఘవాచార్యులు, బి.సుబ్బనాచారి, వి.విద్యాసాగర్, ఎం.శివకుమార్, వి.శ్రీనివాసాచారి, పి.దుర్గాచారి, పి.రమేషాచారి, ఎ.వెంకటేశ్వరరావు, ఆనంద్ ఆచారి, బాలబ్రహ్మచారి, వీరాచారి, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే అభివృద్ధి

## - డా॥ సిఎల్ఎన్ రెడ్డి

విద్య ద్వారానే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజాభివృద్ధికి పాటుపడగలరని డా॥ సి.లక్ష్మీనరసారెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం డాక్టర్ సి.ఎల్.ఎన్.రెడ్డి – సుజనమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో పట్టణంలోని అన్ని పురపాలక సంఘ పాఠశాలల నుండి పేద విద్యార్థులను గుర్తించి వారికి స్కూల్ బ్యాగులు, నోటుపుస్తకాలు, పెన్నులు, యూనిఫామ్‌లతో పాటు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను చదివించి ఉన్నత శిఖరాలకు ఎదిగేలా కృషి చేయడమే ఈ ట్రస్టు యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. అందులో భాగంగానే ప్రతి సంవత్సరం తాము గుర్తించిన పేద విద్యార్థులకు అన్నిరకాల ఫీజులు చెల్లించడంతో పాటు వారికి అవసరమైన పుస్తకాలు,



యూనిఫామ్ తదితర వస్తువులను అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ట్రస్టు కార్యదర్శి అనుమాలశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ 88 సంవత్సరాల వయస్సులో డా॥ సి.లక్ష్మీనరసారెడ్డి సేవా కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనడం హర్షణీయమన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లి మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ పాఠశాల కరస్పాండెంటు విజయశంకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ద్వారకానాథ్‌చౌదరి, వెంగళరావునగర్ పురపాలక సంఘం పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, పాతవూరు పాఠశాల హెచ్‌ఎం జాఫర్ ఖాన్, కలుగోలమ్మ పేట పాఠశాల హెచ్‌ఎం సుబ్బారావు, రోటరీక్లబ్ సభ్యులు జాలరావు, కొండలరావు, విష్ణు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్కె అబాకస్ విజయోత్సవ సభ



నెల్లూరు బాలాజీనగర్ లోని ఆర్కె అబాకస్ మొదటి బ్యాచ్ విజయోత్సవ సభ ఈ నెల14న జరిగింది. ఈ సందర్భంగా మొదటి లెవల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికేట్లు, ప్రశంసాపత్రాలు అందజేసారు. నిర్వాహకులు టి.ఆర్.కె.రెడ్డి, ప్రతాప్‌లు మాట్లాడుతూ గత రెండు నెలలుగా వేసవి సెలవుల్లో అబాకస్,స్పీడ్ మ్యాథ్స్‌లో శిక్షణ ఇస్తూ తిరుపతి కేంద్రంగా నెల్లూరులో అనుబంధంగా నడుపుతూ విద్యార్థుల్లో ఏకాగ్రత, నైపుణ్యం, మేధాశక్తికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ భువనేశ్వర్ ప్రసాద్, బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డిప్యూటీ తహశీల్దార్లకు పదోన్నతులు

నెల్లూరుజిల్లాలోని అయిదుగురు డిప్యూటీ తహశీల్దార్లకు తహశీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ జిల్లా కలెక్టర్ ఎం.జానకి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుపూరు పౌరసరఫరాల శాఖ డిపిఓ చొప్పా రవీంద్రబాబును దుత్తలూరు తహశీల్దారుగా, నెల్లూరు తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ హమీద్‌ను కలువాయి తహశీల్దారుగా, వెంకటాచలం తహశీల్దారు కార్యాలయ సూపరింటెండెంట్ నిర్మలానందబాబును సైదాపురం తహశీల్దారుగా, కావలి చెక్‌పోస్ట్ డిప్యూటీ తహశీల్దార్ ఎన్.లలితను దగదర్తి తహశీల్దారుగా, కలెక్టరేట్ ఈ-సెక్షన్ సూపరింటెండెంట్ రవీంద్రనాథ్‌ను కలిగిరి తహశీల్దారుగా నియమించారు.

## 19న కళాంజలి

# కళా కదంబం

కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్లో 'కళా కదంబం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు కళాంజలి అనంత్ తెలిపారు. కళా కదంబంలో హైదరాబాద్‌కు చెందిన సినీ డ్యాన్సర్ అర్చనచే సినీ నృత్యాలు, తాడేపల్లిగూడెంకు చెందిన వెంకట్రావ్‌చే సినీహీరో కృష్ణ డూప్ డ్యాన్స్‌లు, కళాకారులు, గురుకృప విద్యార్థులచే శాస్త్రీయ నృత్యాలు, జానపద, సినీ నృత్యాలు జరుగుతాయన్నారు. ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకు కూచిపూడి, భరతనాట్యం, జానపదం, సినిమా పాటల పోటీలు జూనియర్, సీనియర్ విభాగాలకు వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గెలుపొందిన విజేతలకు సాయంత్రం జరిగే సభా కార్యక్రమంలో ప్రముఖ సినీ నృత్య దర్శకురాలు ప్రేమలతచే బహుమతులు అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 9848959575 నెంబరులో సంప్రదించాలని కోరారు.

# 12 మందికి పుష్కర పురస్కారాలు

గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నెల్లూరులో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 12 మందికి గోదావరి పుష్కరాల పురస్కారాలను ప్రదానం చేశారు. నెల్లూరు టౌన్‌హాలులో సోమవారం సింహపురి వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు నిర్మల నరసింహారెడ్డి, అర్చక బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య కన్వీనర్ మైపాడు రాజాశర్మ ఆధ్వర్యంలో గోదావరి పుష్కర వైభవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రవచకులు బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి గోదావరి పుష్కర వైభవం గురించి ఉపన్యసించారు. అనంతరం, డి.జి రాజారావు రచించిన గోదావరి పుష్కర వైభవం పుస్తకాన్ని ముఖ్యఅతిథులు ఆవిష్కరించారు. కాగా, పుష్కర పురస్కారాలు అందుకున్నవారిలో భానుప్రకాష్ (వేదం), నాగరాజశర్మ (అర్చకం), జగదీష్‌శర్మ (జ్యోతిష్యం), శివకుమార్ (పౌరోహిత్యం), బాలార్క (సంగీతం), సురభి గాయత్రి (నృత్యం), మనుబోలు ప్రభాకరరావు (పత్రికారంగం), లీలా మోహన్‌రెడ్డి (వాస్తు), పెరుగు రామకృష్ణ (సాహిత్యం), జాహ్నవి (యోగా), తేకూరు సుబ్రహ్మణ్యం (సామాజిక సేవ), కోటేశ్వరమ్మ-లక్ష్మీనారాయణరెడ్డి (క్రీడలు)లు వున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, కరిమద్దెల నరసింహారెడ్డి, ఆలూరు శిరోమణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం

ఉత్తమ ఉపాధ్యాయుల అధ్యక్ష సంఘం ప్రచార కార్యదర్శి అచ్యుత మణి కుమారుడు అచ్యుత హరీష్ జన్మదినం సందర్భంగా ఈ నెల 10వ తేదీ నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల, బాలల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో వారు మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు తమ్మినేని పాండు, సరళ తదితరులు పాల్గొన్నారు.

**సవరణ** తేది. 10.07.2015 'లాయర్' సంచికలో వెలువడిన 'తమిళనాట తెలుగు వెలుగు' శీర్షికలోని పట్టికలో 'తమిళులు'కు బదులుగా తెలుగువారు అని సవరించి చదువుకోవలసిందిగా మనవి. సం/-

# బాబుకి బలి

(మొదటిపేజీ తరువాయి)

పుష్కరాలలో తొక్కిసలాట జరగాలని, ప్రజలు ప్రాణాలు కోల్పోవాలని ఎవరూ అనుకోరు. చంద్రబాబు కూడా అలా ఆశించడు. కాకపోతే పుష్కరాలను తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి వాడుకున్నాడు. ఈ క్రమంలో అవసరమైనవి కాకుండా అనవసరమైనవన్నీ చేసిపెట్టి ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఈ విషాదానికి కారణమయ్యాడు.

చంద్రబాబు ఈ పుష్కరాలను హైప్ చేసాడు. ఎప్పుడూ ఎక్కడా లేని ప్రచారం కల్పించాడు. గోదావరి మహారాష్ట్రలోని నాసిక్ త్రయంబకంలో పుట్టి దాదాపు 1500కిలో మీటర్లు ప్రవహించి ఆంధ్రాలోని అంతర్వేది వద్ద సాగరంలో కలుస్తుంది. ఈ 1500కిలోమీటర్ల దూరంలో ఎక్కడ గోదావరిలో మునిగినా పుణ్యస్నానం ఆచరించినట్లే! కానీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రచారం మాత్రం రాజమండ్రి వద్ద గోదావరిలో మునిగితేనే పుణ్యస్నానం చేసినట్లుగా ప్రచారం కల్పించింది. దీనికితోడు ముఖ్యమంత్రే రాజమండ్రిలో ఉంటూ పుష్కర పనులను పర్యవేక్షించడం, పుష్కరాలకు 1600కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ప్రకటించడంతో ఇక్కడేదో బ్రహ్మాండం ఉందన్నట్లు భక్తులు పోటెత్తి వచ్చారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో వందల సంఖ్యలో ఘాట్‌లున్నాయి. వాటిలో ఎక్కడ మునిగినా ఒకటే. సాధారణంగా ఆంధ్రాలోని 13జిల్లాల వారికి రవాణా పరంగా గాని, సౌకర్యాల మూలంగా గాని రాజమండ్రి అనుకూలంగా ఉంటుంది. కాబట్టి పుష్కరాలంటే భక్తులు ఎక్కువగా రాజమండ్రికే వస్తుంటారు. దీనికి తోడు ఈసారి ప్రభుత్వం చేసిన ప్రచారార్భాటం కూడా ఇక్కడ భక్తుల తాకిడి పెరగడానికి దోహద పడింది. రాజమండ్రి వద్ద లేజర్‌షోలు, కలర్‌ఫుల్ లైటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలపై ప్రచారం గుప్పించడంతో పుష్కరాలు రాజమండ్రిలో మాత్రమే జరుగుతున్న భావన కలిగింది.

**చంద్రబాబు పాపమెంత?**

పుష్కరాలను పుష్కరాలు మాదిరిగానే చూసుంటే ఈ ఘోరం జరిగేది కాదు. పుష్కరాలను రాజకీయ ప్రయోజనాలు, వ్యక్తిగత కీర్తిప్రతిష్టతో చూడడం వల్లే ఇంతటి విషాదం నెలకొంది. ఆంధ్రాలో కంటే గోదావరి తెలంగాణలో ఎక్కువ దూరం ప్రవహిస్తుంది. అక్కడ ఆరు జిల్లాల్లో ఈ నదీ తీరాలు ఉన్నాయి. చంద్రబాబుతో పోలిస్తే తెలంగాణ సీఎం కేసీఆర్ పరిపాలనానుభవంలో చాలా చిన్నోడు. కాని తెలంగాణలో పుష్కరాలను కేసీఆర్ ఎంతో హుందాగా నిర్వహించారు. అన్ని జిల్లాల్లో గోదావరి ప్రవహించే అన్ని ఘాట్‌లకు సమాంతర ప్రాధాన్యత కల్పించాడు. భక్తులు ఒకే చోట గుమికూడే పరిస్థితి రానీయలేదు. ఒక్కో జిల్లాలో ఒక్కో మంత్రి పుష్కరాల పనులను, భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. కేసీఆర్ కుటుంబసభ్యులు కూడా తలోచోట మునిగారు. కాబట్టి అక్కడ పుష్కర స్నానాలు ప్రశాంతంగా జరుగుతున్నాయి.

ఏపిలో చూస్తే చంద్రబాబు, మంత్రులు, వివిపిలు అంతా కూడా రాజమండ్రిలోనే వాలిపోయారు. చంద్రబాబు అక్కడే వుండడంతో అధికారులు సైతం ఆయన చుట్టూరా తిరగడానికి సరిపోయింది గాని భక్తులకు ఏర్పాట్లను ఏం చూసుకుంటారు. ఇక ఘాట్ల వద్ద గేట్లను మూసివేయాల్సిన అవసరం కూడా లేదు. ఎప్పుడూ ఘాట్‌ల వద్ద స్నానాలు చేసే అవకాశం కల్పిస్తే భక్తులు హాయిగా మునిగి వెళ్ళిపోయేవాళ్ళు. ఒకవేళ ఒక ఘాట్ వద్ద రద్దీ ఉంటే కొద్దిసేపు ఆగడమో లేక ఇంకో ఘాట్ వద్దకు వెళ్లడమో చేసేవాళ్లు!

**అసలు చంద్రబాబుకేం పని?**

పుష్కరాల ఏర్పాట్లు తప్ప ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు ఇంకేం పనులు లేవా? పుష్కరాల పనులను సీఎం పరిశీలించవచ్చు, పర్యవేక్షించవచ్చు. ఎంత వరకు... ఒకరోజు వచ్చి చూడొచ్చు. కాని కాంట్రాక్టర్ మాదిరిగా అక్కడేవుండి పనులను చూడాల్సిన పని లేదు. ముఖ్యంగా పుష్కరాల పనులను దేవాదాయశాఖ చూడాలి. పుష్కరాల పనుల్లో తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని స్వయంగా దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావే వాపోవడం జరిగింది. పుష్కరాల బాధ్యతలను పంచలేదు. చంద్రబాబు అంతా తానే చూడాలనుకున్నాడు. ఖజానా నుండి 1600కోట్లు పుష్కర పనులకు విడుదల చేసినప్పుడు ఆ మాత్రం ఆసక్తి ఉంటుందేమో! పుష్కరాల నిర్వహణ కోసం మంత్రులతో ఓ కమిటీని కూడా వేసారు. ఈ కమిటీలో మంత్రులు కొందరు చంద్రబాబుతో జపాన్ పర్యటనకు, ఇంకొందరు అమెరికాలో 'తానా' సభలకు వెళ్లారు. పుష్కరాల నాటికి వచ్చారు. ఇక వీళ్ల ఏర్పాట్లు చూసేదెక్కడ. దేశ వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలను పెట్టుకుని కంప్యూటర్ల ద్వారానే వ్యాపార వ్యవహారాలు చూసుకునే మంత్రి నారాయణ లాంటి వాళ్ళను ఈ కమిటీలో వేస్తే పరిస్థితులు ఇలాగే అఘోరిస్తాయి.

రాష్ట్రంలో ఎన్నో సమస్యలున్నాయి. ఓ పక్క మున్సిపల్ కార్మికుల సమ్మె జరుగుతోంది. రాష్ట్రం అప్పుల్లో వుంది. కేంద్రం నుండి నిధులందడం లేదు. ఇంతవరకు ప్రభుత్వం పారిశ్రామిక విధానాన్ని ప్రకటించలేదు. రావాలనుకున్న పరిశ్రమలు కూడా వెనక్కిపోతున్నాయి. ఈ సమస్యలన్నింటిని అధిగమించి రాష్ట్రాభివృద్ధికి బాటలు వేసే విధంగా ముఖ్యమంత్రి ప్రతి నిమిషం కష్టపడాలి. రాజమండ్రిలో చంద్రబాబు ఉన్నా లేకున్నా పుష్కర స్నానాలు ఎలాగూ జరుగుతాయి. పుష్కరాలు చంద్రబాబు కొత్తగా ప్రవేశపెట్టినవి కావు. కొన్ని వందల ఏళ్ళ నుండి వస్తున్నవే! ప్రచారార్భాటాలు లేకుండానే ప్రశాంతంగా జరిగిపోతుండేవి. కాని చంద్రబాబు ఈసారి నడమంత్రంగా ఈ పుష్కరాలను జరపాలనుకుని తన విలువైన కాలాన్ని ఇక్కడ వృధా చేసాడు. పుష్కరాలకు 2000 కోట్లు ఖర్చుపెట్టానని ఘనంగా చెప్పుకుంటూ... అప్పుల్లో వున్నాం 4వేల కోట్లు ఇవ్వండంటూ కేంద్రాన్ని అడగడం విడ్డూరంగా వుంది. పుష్కరాలు మత విశ్వాసాలు. ప్రజల నమ్మకంతో ముడి పడింది. ఇందులో ఎవరు స్వప్రయోజనాలు, రాజకీయ ప్రయోజనాలు ఆశించినా తప్పే! పుష్కరాలు ఒక రోజులో ముగిసేవి కావు. 12రోజుల పాటూ ఉంటాయి. గోదావరిలో ఎక్కడ మునిగినా అది పుష్కర స్నానమే. పుష్కరాలు జాతరలు, బ్రహ్మోత్సవాలు కాదు హంగు, ఆర్భాటాలు చేయడానికి. అదొక ప్రశాంతమైన కార్యక్రమం. పుష్కరాలను వాటి రీతిలో చేయకపోతే ఇలాంటి అనర్థాలే జరుగుతాయి.

# మీడియా మంచి చేస్తుందా?

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో సాక్షి ఛానెల్, సాక్షి పత్రికది వైకాపా దారి. ఇవి వారి సొంతవి కాబట్టి ఇందులో ప్రభుత్వ అనుకూల వార్తలను ఆశించలేం. ఎన్‌టివి కొంత ప్రభుత్వ వ్యతిరేకత చూపించేసరికి ఎంఎస్‌ఓల మీద ఒత్తిడి తెచ్చి ఆ ఛానెల్ రాకుండా చేసారు. ప్రధానమైన ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలతో పాటు టీవీ9, ఈటీవీ, ఏబిఎన్ వంటి న్యూస్ ఛానెల్స్ అన్నీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటున్నాయి. ఎన్నికల సమయంలో తమకు నచ్చిన పార్టీని ఇవి ప్రమోట్ చేయవచ్చు. తమకు అనుకూలమైన ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు మంచి పనులు చేస్తే ఒకటికి నాలుగుసార్లు చూపించవచ్చు. ఈరోజుల్లో వాటిని తప్పు పట్టలేం కూడా! కాని ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నప్పుడు, ఆర్థికంగా రాష్ట్రానికి భారమవుతున్నప్పుడు మీడియా తన పాత్రను పోషించకుంటే ఎలా? ఈరోజు ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపినంతమాత్రాన ప్రభుత్వం కూలిపోయేదేమీ వుండదు. ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనేందుకు దగ్గరలో ఎన్నికలు కూడా లేవు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు పగ్గాలు చేపట్టినప్పటి నుండి తీసుకున్న కొన్ని ప్రజావ్యతిరేక నిర్ణయాలను మీడియా పట్టించుకోలేదు. పచ్చటి పొలాలను నాశనం చేసి రాజధాని కట్టాల్సిన అవసరముందా? అని అడగలేదు. రేపు వేలాది ఎకరాల పంట భూములు కాంక్రీట్ అరణ్యాలుగా మారితే ఆ పాపంలో మీడియాకు కూడా భాగముంటుందని గుర్తించాలి. ఓ పక్క పోలవరం మంజూరై ఉండగా ఈలోపు పట్టిసీమ చేపట్టాల్సిన అవసరమేంటో అడగలేదు. పుష్కరాలకు 1600కోట్ల ఖర్చుపై చర్చలు లేవు. ఇసుక రవాణాను అడ్డుకున్న తహశీల్దార్‌ను ఇసుకలోనే ఈడ్చి కొడితే ఇదేమని ఈ మీడియా మైకెత్తి ప్రశ్నించలేదు. చంద్రన్న సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ ఖజానాను ఊడ్చేస్తుంటే ఇది కరెక్ట్ కాదని చెప్పలేదు. ఆఖరుకు పుష్కరాల మృతుల విషయంలో కూడా ప్రభుత్వానిది కాదు, పుష్కరాలకు పోటెత్తి వచ్చిన ప్రజలదే తప్పనట్లుగా మీడియా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ నిర్ణయాలలో లోపాలుంటే ఇప్పుడే ఎత్తి చూపితే విజ్ఞులైన పాలకులు వాటిని ఖచ్చితంగా సరిదిద్దుకుంటారు. దానివల్ల ప్రజలకు, రాష్ట్రానికి కూడా మేలు జరుగుతుంది. ఈరోజు మీడియా ఒక తప్పుకు వంతపాడితే రేపు వందతప్పులు జరుగుతాయి.

కానీ, అన్ని వేళలా మీడియానే ప్రజలను ప్రభావితం చేయలేదు. మీడియా చెప్పిందే జనం నమ్ముతారని అనుకోవడం కూడా మూర్ఖత్వమే. అలా జరిగే పనైతే ఈ రాష్ట్రంలో శాశ్వతంగా తెలుగుదేశమే అధికారంలో ఉండిపోయేది. మధ్యలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చుండేది కాదు.

# పంజాబ్ సింగ్స్... హ్యాండ్ బాల్ కింగ్స్!



12వ తేదీ పోటీలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు

ఈ నెల 12వ తేదీ నుండి 15వతేదీ వరకు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడామైదానంలో జరిగిన జాతీయ స్థాయి 29వ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ కప్ పోటీలలో పంజాబ్ సింగ్స్ ఛాంపియన్స్‌గా నిలిచారు. పురుషులు మరియు మహిళల విభాగం రెండింటిలోనూ పంజాబ్ జట్లే విజేతగా నిలవడం విశేషం. ఇటీవలే రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు ఓఎస్‌డి, ఆయనకు నమ్మినబంటు సత్య కుమార్‌ను ఎన్నుకోవడం తెలిసిందే! సత్య కుమార్ ప్రత్యేకశ్రద్ధ పెట్టే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను నెల్లూరుజిల్లాలో జరిపించారు. తన గురువు వెంకయ్య నాయుడు చేతులమీదుగానే ఈ నెల 12వ తేదీన ఈ పోటీలను ప్రారంభింపజేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన జట్లు లీగ్‌మ్యాచ్‌లలో హోరాహోరీగా తల పడ్డాయి. మహిళల విభాగం నుండి జరిగిన ఫైనల్స్‌లో పంజాబ్ జట్టు భారతీయ రైల్వేస్ జట్టుపై విజయం సాధించింది. పురుషుల విభాగం నుండి జరిగిన ఫైనల్స్‌లో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ జట్టుపై పంజాబ్ జట్టు గెలిచింది. ఈ పోటీల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి పురుషుల విభాగంలో 11 జట్లు, మహిళల విభాగంలో ఏడు జట్లు వచ్చి తలపడ్డాయి. 15వ తేదీ సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పాల్గొని విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఈ పోటీలను చక్కగా నిర్వహించేందుకు కృషి చేసిన కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిని అభినందించారు. ముగింపుసభలో ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, బీద రవిచంద్ర, బీజేపీ నాయకులు సురేంద్ర రెడ్డి, ఆంజనేయరెడ్డి, తెలుగుదేశంపార్టీ గూడూరు ఇన్‌ఛార్జ్ బి.జ్యోత్స్నలత, జాతీయ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు రామబ్రహ్మం, శాప్ డైరెక్టర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీనందజేస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

# కార్యకర్తలకు అండగా నిలుస్తా!



నెల్లూరురూరల్ మండలంలోని కార్యకర్తలకు అండగా నిలుస్తానని, ప్రజాసమస్యలపై పోరాడాలని తెలుగుదేశంపార్టీ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరపాళెంలో నిర్వహించిన టిడిపి మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో జన్మభూమి కమిటీలు, టీడీపీ కమిటీలు బలోపేతం కావాలన్నారు. ఈ సందర్భంగా నెల్లూరురూరల్ మండల తెలుగు యువత అధ్యక్షుడిగా పముజుల ప్రదీప్‌ను ఎంపిక చేశారు. టిడిపి మండల నాయకుడు వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, ఏయంసి వైస్‌ఛైర్మెన్ రాంగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# చింతా కొత్త గేమ్



తిరుపతి మాజీఎంపీ చింతా మోహన్ మంచి రాజకీయ కళాకారుడు. దళిత నాయకులలో ఇంత సుధీర్ఘ కాలం ఒకే నియోజకవర్గం నుండి రాజకీయాలు చేసిన వాళ్లు చాలా తక్కువుగా వుంటారు. ఈయనకు రాజకీయంగా గాడ్‌ఫాదర్‌లు లేరు. మొదటి నుండి ఢిల్లీలో ప్రత్యేక లాబీని ఏర్పాటు చేసుకుని, దాని ద్వారానే కొట్టుకొస్తున్నాడు. ఒక రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుండి ఒకే నాయకుడు ఆరుసార్లు ఎంపీగా గెలవడమంటే సాధారణ విషయం కాదు. ఆ టాలెంట్ చింతా మోహన్‌కే చెల్లింది. అయితే ఆరుసార్లు ఎంపీగా చేసినా తిరుపతి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ప్రత్యేకంగా పొడిచిందేమీ లేదు. 2014 ఎన్నికల్లో తిరుపతి నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినా డిపాజిట్ కూడా రాలేదనుకోండి.

అయినా ప్రొఫెషనల్ పొలిటీషియన్ కాబట్టి రాజకీయాలను వదిలిపెట్టడు. తాను ఉన్నానని చెప్పుకోవడానికి, తన ఉనికిని చాటుకోవడానికి తాజాగా ఓ ప్రోగ్రామ్ పెట్టుకున్నాడు. అదే దుగరాజపట్నం సాధన కోసం పాదయాత్ర. చింతా పాదయాత్ర చేసినా, చేయకున్నా కేంద్రం ఇవ్వాలనుకుంటే వస్తుంది, లేకుంటే పోతుంది. చింతా పాదయాత్ర వల్ల వచ్చే ప్రయోజనమేమీ లేదు. ఈయన పాదయాత్ర దెబ్బకు అక్కడ ప్రధాని నరేంద్ర మోడీ చలించేదేమీ లేదు.

ఈ పోర్టు పట్ల చింతాకు ఇప్పుడున్న పట్టుదల ఆయన ఎంపీగా ఉన్నప్పుడే మయ్యింది. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే పాదయాత్ర చేసుండొచ్చు కదా? సోనియాను, అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను నిలదీసి ఉండొచ్చు కదా! విభజన కంటే ముందే యూపిఏ ప్రభుత్వం దుగరాజపట్నం పోర్టును మంజూరు చేసి గెజిట్ కూడా విడుదల చేసింది. ఆరోజే శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టి ఉంటే ఈరోజు ఇన్ని సందేహాలుండేవి కావు. విభజన బిల్లులో కూడా దుగరాజపట్నం పోర్టును చేర్చారు. అప్పుడైనా ప్రధాని వచ్చి శంకుస్థాపన చేసుండొచ్చు. ఆరోజు యూపిఏ ఈ పోర్టును పట్టించుకోలేదు. ఎంపీగా వున్న చింతా మోహన్ కూడా ఇంతగా ప్రయత్నించలేదు. చేతిలో అధికారం, అవకాశం ఉన్నప్పుడు ఈ పోర్టు ప్రయత్నాలు చేయకుండా, ఇప్పుడు ఖాళీగా ఉన్నామని పాదయాత్రలు పెట్టుకుంటే సరిపోతుందా?

## అంతరిక్ష వ్యాపారంలో

# అదరగొడుతున్న ఇస్రో

### విజయవంతంగా 5 విదేశీ ఉపగ్రహాలు ప్రయోగించిన షార్



పిఎస్ఎల్‌వి సీరీస్... భారత అంతరిక్ష పరిశోధనా సంస్థకు నమ్మకంలో అమ్మలాంటిది. ఈ సిరీస్‌లో రాకెట్‌ను ప్రయోగిస్తున్నారంటే ఎవరికీ టెన్షన్ అక్కరలేదు. గుండెల మీద చేతులేసుకుని నిబ్బరంగా ఉండొచ్చు. పిఎస్ఎల్‌విని పైకి పంపాక ఎక్కడో మిస్సవుతుందనే దిగులే అవసరం లేదు. అది ఖచ్చితంగా నిర్దేశించిన కక్ష్యలోకి ఉపగ్రహాలను చేర్చుతుంది. తనపై ఇస్రో ఉంచిన నమ్మకాన్ని పెంచుకోవడంలో పిఎస్ఎల్‌వి మరో ముందడుగు వేసింది. ఒక్క ఇస్రోకే కాదు, విదేశాలకు సైతం తన మీద నమ్మకం కలిగేలా చేసుకుంది. ఐదు విదేశీ ఉపగ్రహాలతో ఈ నెల 10వతేదీ నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి ప్రయోగించిన పిఎస్ఎల్‌వి–సి28 విజయవంతమైంది. ఇస్రో చరిత్రలోనే అత్యంత భారీ వాణిజ్య ప్రయోగమిది. దీని విజయంతో అంతరిక్ష వాణిజ్యంలోనూ 'ఇస్రో' ముందడుగు వేసినట్లయ్యింది.

10వ తేదీ రాత్రి 9.58గంటలకు షార్‌లోని లాంచింగ్ ప్యాడ్ నుండి పిఎస్ఎల్‌వి–సి28 రామబాణంలా నింగిలోకి దూసుకెళ్లింది. రాకెట్‌లో మొత్తం నాలుగు దశల మోటార్లతో ప్రయోగం జరిగింది. 19నిముషాల 15సెంకడ్లలో ప్రయోగం పూర్తయ్యింది. భూ ఉపరితలానికి 65.3కిలోమీటర్ల ఎత్తులో, భూమధ్య రేఖకు 98.6డిగ్రీల వాలులో సెకను వ్యవధిలో డిఎంసి–3–1, 2, 3ఉపగ్రహాలు మూడింటిని కక్ష్యలో వదిలింది. ఒక సెకను తర్వాత డిఆర్బిట్ సెయిల్‌నానో ఉపగ్రహాన్ని, సిబిఎన్‌టి–1 మైక్రో ఉపగ్రహాన్ని కక్ష్యలో వదిలింది. మొత్తం 1440 కిలోల బరువుగల 5 బ్రిటన్ ఉపగ్రహాలను ఈ రాకెట్ ద్వారా విజయవంతంగా కక్ష్యలో ప్రవేశ పెట్టడం జరిగింది.

ఈ ప్రయోగం విజయవంతం కాగానే షార్ శాస్త్రవేత్తలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని అభినందనలు తెలుపుకున్నారు. ఇస్రో ఛైర్మెన్ కిరణ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించారు. షార్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాక కున్హికృష్ణన్‌కు ఇది తొలి ప్రయోగం కావడం విశేషం.








Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com